E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 09-05-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:127 || పేజీలు–6
www.ekaburu.com

## మూసీ ప్రాజెక్టు తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు


03


02


## తూకాలు వేయాలంటే.. లంచాలు ఇవ్వాలా?

- గన్నీ బ్యాగులు సరఫరా చేసే సోయి కూడా ప్రభుత్వానికి లేదా?
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈ-కబురు, వీర్నపల్లి, : పండించిన ధాన్యం తూకాలు వేసేందుకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.


02

## నేడు పశ్చిమ బెంగాల్ కు సీఎం చంద్రబాబు


03

## హైడ్రా యాక్షన్ ప్లాన్.. ఇక వరదలకు చెక్



# తమిళనాట మరో ట్విస్టు

- ప్రతిష్టంభనలో విజయ్ ప్రమాణ స్వీకారం
- మద్దతు ప్రకటించినా అధికారికంగా లేఖ ఇవ్వని వీసీకే
- నాలుగు డిమాండ్లకు అంగీకరించాలని పట్టు
- నేడు తుది నిర్ణయం తీసుకునే అవకాశం
- విజయ్‌కి గవర్నర్ నుంచి ఇంకా అందని ఆహ్వానం
- వీసీకే మద్దతు ఇస్తే నేడే దళపతి ప్రమాణ స్వీకారం
- బయటి నుంచే మద్దతు ఇస్తామన్న సీపీఐ, సీపీఎం
- బెంగళూరుకు చేరిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ఈకబురు, చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి నరాలు తెగే ట్విస్టులు చోటు చేసుకున్నాయి. జోసెఫ్ విజయ్ అనే నేనూ.. అంటూ శనివారం ప్రమాణ స్వీకారానికి విజయ్ సిద్ధమయ్యారన్న సంకేతాలు టీవీకే వర్గాల్లో జోష్‌ను నింపి సంబరాల్లో ముంచెత్తాయి. అదే సమయంలో మద్దతు ఇచ్చామని చెప్పి, తర్వాత యూ టర్న్ తీసుకున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), విడుదలై చిరుతైగళ్ కట్చి (వీసీకే) రూపంలో దళపతి విజయ్‌కు పెద్ద షాక్ తప్పలేదు.సీపీఎం, సీపీఐలు బయటి నుంచి మద్దతు ఇస్తూ అధికారికంగా లేఖలు ఇవ్వగా, ఐయూఎంఎల్, వీసీకే మాత్రం ఇంకా లేఖలు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. తెరవెనుక బేరసారాల కోసమే మద్దతు విషయంలో వీసీకే తన అభిప్రాయం మార్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ 108 మంది ఎమ్మెల్యేలను (విజయ్ రెండు చోట్ల నెగ్గారు) గెల్చుకున్న సంగతి తెలిసిందే. మరో 10 మంది మద్దతు సంపాదించాల్సి ఉండగా, విజయ్ పార్టీకి అండగా నిలుస్తామని సీపీఐ(2), సీపీఎం(2), కాంగ్రెస్(5) ప్రకటించాయి. మొదట వీసీకే(2) నుంచి సానుకూల స్పందన రావడంతో మొత్తం బలం 118కి చేరింది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సిద్ధమయ్యారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమకు ప్రస్తుతం 116 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు లేఖలను పంపిస్తామని తెలియజేశారు. దాంతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలంటూ విజయ్‌ని గవర్నర్ ఆహ్వానించినట్లు వార్తలు వచ్చాయి.అయితే, విజయ్‌కి మద్దతు విషయంలో వీసీకే శుక్రవారం అర్ధరాత్రి దాకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మద్దతు లేఖ ఇవ్వలేదు. ఆ పార్టీ శనివారం తన తుది నిర్ణయాన్ని వెల్లడించనున్నట్లు సమాచారం. ఒకవేళ విజయ్‌కి మద్దతుగా ప్రకటన చేస్తే శనివారమే ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. గవర్నర్‌తో భేటీ తర్వాత విజయ్ చెన్నైలో సీపీఎం, సీపీఐ కార్యాలయాలకు వెళ్లారు. ఆయా పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వామపక్షాల ఆఫీసులను విజయ్ సందర్శించడం ఇదే మొదటిసారి. కాంగ్రెస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో నలుగురు శుక్రవారం రాత్రి బెంగళూరుకు చేరుకోవడం గమనార్హం.

మిగతా 2లో

## బంగారు తునకలా మార్చుకుందాం

- కలిసికట్టుగా కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం
- ఏడాదిన్నరలోపు ఇక్కడ కృష్ణా జలాలు పారిద్దాం
- ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుదాం
- కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



ఈకబురు, వికారాబాద్: దశాబ్దాల తరబడి అన్యాయానికి గురైన కొడంగల్‌ను బంగారు తునకగా మార్చుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కాదు అనేలా నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందామని, దేశంలోని గొప్ప గొప్ప పరిశ్రమలు కొడంగల్ బాట పట్టాయని తెలిపారు. శుక్రవారం కొడంగల్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో కలిసి రూ.110 కోట్లతో కొడంగల్ వెంకటేశ్వరస్వామి, రూ.2 కోట్లతో కోస్గి వేణుగోపాలస్వామి, రూ.2.5 కోట్లతో దౌల్తాబాద్ వెంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...'నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్నిఏడాదిన్నర లోపు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తాం. దీనికి సంబంధించిన భూసేకరణ బాధ్యతలను మంత్రి శ్రీహరికి అప్పగిస్తే నెల రోజుల్లో పూర్తి చేశారు. ఎత్తిపోతల పథకానికి ఇక ఏ అడ్డంకులూ లేవు. ఎప్పుడంటే అప్పుడు నిధులు మంజూరు చేస్తాం. ఏడాదిన్నర లోపు పనులు పూర్తి చేసి లక్షన్నర ఎకరాలకు నీరందిస్తాం. రైల్వేలైన్ కోసం పరిగి ఎమ్మెల్యే ఎప్పటినుంచో ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు మనకు అవకాశం వచ్చింది. వికారాబాద్ - కృష్ణా రైల్వే మంజూరు పనులు ఇప్పటికే తొంభై శాతం పూర్తయ్యాయి.

మిగతా 2లో



## రేపు హైదరాబాద్‌కు రానున్న ప్రధాని

- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలు
- నేటి అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం

02

## తెలంగాణకు జలద్రోహం చేస్తున్న కాంగ్రెస్ ను బొంద పెడుతం

- తెలంగాణ వచ్చిన తర్వాత కూడా మన నీళ్లు దక్కలే
- సమైక్య రాష్ట్రంలో ఆంధ్రోళ్లను నిందించినం.. మన పార్టీ
- మేం అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తాం
- సాగు యోగ్యమైన ప్రతి గుంట భూమికి ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇస్తాం
- నీళ్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిన ద్రోహానికి ప్రజలు వాళ్లను క్షమించరు



ఈకబురు :
తెలంగాణ రక్షణ సేన ఏర్పడిన తర్వాత మొదటి సారిగా మహబూబ్ నగర్ జిల్లాలో సభ పెట్టుకోవటం సంతోషం.

మిగతా 3లో

## ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్

03



## ప్రజలకు విద్య, వైద్యం, విద్యుత్ భారం తగ్గాలి

- ఇళ్లు కట్టాలి... ఇళ్ల స్థలాలు ఇవ్వాలి... క్రమబద్ధీకరించాలి
- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావల వడ్డీ రుణాలు
- ఎస్సీలకు కలిగే ప్రయోజనాలన్నీ బుడగజంగాలకు కల్పించండి
- రూరల్ ఆటోనగర్‌ల ఏర్పాటుపై దృష్టి సారించండి
- అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ రావాలి
- పేదల సంక్షేమం కోసమే సమీక్షలు... సమావేశాలు
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు




**ఈ-కబురు,,అమరావతి, మే 8:**
సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు ఇవ్వాలని... అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించడం వంటి అంశాలపై ప్రభుత్వ యంత్రాంగం ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 చివరి నాటికి రీసర్వే పూర్తి చేయడంతోపాటు... 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా రెండో రోజున సీఎం చంద్రబాబు సంక్షేమ శాఖలు, రెవెన్యూ, హౌసింగ్, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

మిగతా 2లో

## భారీ జనసమీకరణకు బీజేపీ కసరత్తు..

- రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలతోపాటు ప్రజలను ప్రధాని మోదీ సభకు రప్పించేందుకు ఏర్పాట్లు
- ఎక్కడికక్కడ జిల్లాల వారీగా ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, డీకే అరుణల నిత్య పర్యవేక్షణ

02



## హైదరాబాద్ లో అర్ధరాత్రి మహిళ దారుణ హత్య

- వినయ్ రంజన్ రే భార్య సునంద ను హత్య చేయడంతో నగరంలో కలకలం
- పనిమనిషి కల్పన, ఆమె గ్యాంగ్ హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తింపు
- అర్ధరాత్రి రెండు గంటలకు హత్య జరిగిందన్న సీపీ సజ్జనార్

02



## బెంగాల్‌లో తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి

- బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించిన గవర్నర్
- రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకారం
- హాజరు కానున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన
- రాష్ట్రంలో భయం పోయింది, భరోసా వచ్చింది
- సువేందు అధికారి స్పష్టీకరణ

03



ఈ-కబురు

09- 05 - 2026
శనివారం
E-kaburu.com


# హైదరాబాద్ లో అర్ధరాత్రి మహిళ దారుణ హత్య



ఈకబురు హైదరాబాద్ :
హైదరాబాద్‌లో ప్రముఖులు నివసించే ప్రాంతంలో ఓ మహిళ దారుణ హత్య కు గురికావడం నగరం లో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద (55) దారుణ హత్యకు గురయ్యారు. బంగారం, డబ్బుల కోసం పనిమనిషి కల్పన ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కల్పనతో పాటు ఆమె గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడిందని భావిస్తున్నారు. రిటైర్డ్ అధికారి నివాసంలో కల్పన పనిమనిషిగా చేరింది. పక్కా ప్లాన్‌తో ఏడెనిమిది నెలల పాటు కల్పన, ఆమె గ్యాంగ్ ఎదురుచూసినట్లు తెలుస్తోంది.ఇంటి ముందు నుంచి వస్తే సీసీటీవీ ఫుటేజీకి చిక్కుతామని భావించి, వెనుక నుంచి వచ్చి ఈ హత్యకు పాల్పడ్డారు. కల్పనతో సహా మొత్తం ముగ్గురు ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. హత్య తర్వాత పారిపోయే క్రమంలో ఒక నిందితుడి క్యాప్ కిందపడటంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. సునంద భర్త వినయ్ రంజన్ రే ప్రస్తుతం బెంగళూరులో ఉన్నారు.సునంద ఒంటరిగా ఉన్న విషయాన్ని గుర్తించిన కల్పన, ఈ విషయాన్ని తన గ్యాంగుకు చేరవేసి వారిని రప్పించింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ హత్య జరిగిందని పోలీసులు నిర్ధారణ కు వచ్చారు. కల్పన నేపాల్‌కు చెందిన మహిళ. డబ్బులు, బంగారం చోరీ కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియా తో తెలిపారు... నేపాలీ గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని అన్నారు. కొన్ని ఆధారాలు సేకరించామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సజ్జనార్ అన్నారు. నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేశారని వెల్లడించారు. బంగారం, నగలు ఎత్తుకుపోయారా లేదా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. వెనుక గేటు నుంచి వచ్చి హత్య చేసినట్లు చెప్పారు. కాగా, ఘటనా స్థలాన్ని డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్ పరిశీలించారు. నేపాల్ గ్యాంగ్ ను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాగా పోలీసులు ఈ కేసును సవాల్ గా తీసుకొని నిందితుల కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.

# నేడు పశ్చిమ బెంగాల్ కు సీఎం చంద్రబాబు

**ఈ-కబురు అమరావతి :**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటించనున్నారు. అక్కడ జరగనున్న నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఆయన పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ స్థాయి నేతలు ఈ కార్యక్రమానికి తరలివస్తుండటంతో చంద్రబాబు పర్యటన రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.షెడ్యూల్ ప్రకారం, సీఎం చంద్రబాబు నేటి ఉదయం 7:05 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 7:40 గంటలకు ప్రత్యేక విమానంలో ప్రయాణించి, ఉదయం 9:20 గంటలకు కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు.

అనంతరం విమానాశ్రయం నుంచి నేరుగా ప్రమాణ స్వీకార వేదిక అయిన బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు.

# రేపు హైదరాబాద్‌కు రానున్న ప్రధాని



ఈకబురు, హైదరాబాద్ :
రేపు (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో నివసించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొన్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయినపల్లి, మారేడ్పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నేటి అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజిగిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలు పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

**–బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలు**

...డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం

రేపు (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో నివసించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొన్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయినపల్లి, మారేడ్పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నేటి అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజిగిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో

## తూకాలు వేయాలంటే..
# లంచాలు ఇవ్వాలా?

మక్కల కొనుగోళ్లకు కనీసం గన్నీ బ్యాగులు సరఫరా చేసే సోయి ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందల సంఖ్యలో వాహనాలతో మార్కెట్ల ఎదుట అన్నదాతలు పడిగాపులు కాస్తున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి కుర్చీలు కాపాడుకునేందుకు దిల్లీకి మూటలు మోస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. భారాస హయాంలో అడగకుండానే రైతు బంధు వేసిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల ముందు, కేసీఆర్ సభ పెడుతున్న సందర్భంగా రైతుబంధు పంపిణీ చేశారంటూ కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. సమ్మక్కసారలమ్మ జాతర పనుల్లో వాటాల కోసం మంత్రులు కొట్లాడుకున్నారని విమర్శించారు. కొత్త పథకాల మాట అటుంచితే.. ఉన్నవి కూడా తొలగిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 420 హామీలపై నిలదీస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, వీటికి జంకే ప్రసక్తే లేదన్నారు. జడ్పీ ఎన్నికలు నిర్వహించే ధైర్యం ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మత రాజకీయాలు తప్ప.. ప్రజాసంక్షేమం, రైతుల సమస్యలపై అవగాహన లేదని విమర్శించారు.

# బంగారు తునకలా మార్చుకుందాం



మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేసి పరిగి, కొడంగల్‌లో రైలు కూత వినిపిస్తాం. సుద్ద గనులు మన దగ్గర ఉంటే సిమెంటు కంపెనీలు కర్ణాటకలో ఉండేవి. మన ఖనిజ సంపదంతా అక్కడకు తరలివెళ్లేది. ఇప్పుడు పరిస్థితి మారింది. వచ్చే ఆరు నెలల్లో నియోజకవర్గంలో సిమెంటు పరిశ్రమ నిర్మాణం జరుగుతుంది. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.

మెడికల్, ఇంజనీరింగ్, ఏటీసీ సెంటర్, నర్సింగ్ కాలేజీ, పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్ ఇలా అన్ని విద్యా సంస్థలు ఇప్పుడు కొడంగల్‌లో ఏర్పాటు అవుతున్నాయి. ఏడాదిన్నరలోపు ఎడ్యుకేషన్ హబ్ పనులు పూర్తవుతాయి. ఉపాధి అవకాశాలు లేక పేదలు పూణే, బాంబేలకు వలసలు వెళ్లేవారు.. నేడు మన దగ్గరే పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

**పేదల తిరుపతిగా**

కొడంగల్ వెంకటేశ్వరాలయం తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా పేదల తిరుపతిగా విరాజిల్లుతోంది. ఇప్పుడు పునర్‌నిర్మాణ పనులు చేపట్టి తిరుపతి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. ఈ ప్రాంతానికి చెందిన ఆగమ శాస్త్ర పండితులు సుందర వరదాచార్యుల సలహా ప్రకారమే తిరుపతిలో అన్ని కార్యక్రమాలు జరిగేవి. ఇప్పుడు ఇక్కడ భూమి పూజ కూడా ఆయన పెట్టిన ముహూర్తానికే చేశాం. కానీ ప్రస్తుతం ఆయన మన మధ్యలేకపోవటం ఎంతో లోటు. ఈ ప్రాంత ప్రజలు ఆయనను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఆలయంలోని ఓ విడిదికి వరదాచార్యుల పేరు పెడతాం.

**వెనుకబాటుకు గురయ్యాం..**

గురునాథ్‌రెడ్డి కొడంగల్ నుంచి అనేకసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా మంత్రి కాలేకపోయారు. కొడంగల్ అభివృద్ధికి ఆనాడు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దశాబ్దాలుగా ఈ ప్రాంతం నుంచి గెలిచిన వారెవరూ మంత్రి కాలేకపోయారు. దీంతో అభివృద్ధిలో వెనుకబాటుకు గురయ్యాం. ప్రజల ఆశీర్వాదంతో ఇప్పుడు ముఖ్యమంత్రిగా నిలబడ్డా. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కాదు అన్న తరహాలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం.

**అభివృద్ధిలో కలిసిసాగాలి**

పార్టీలకతీతంగా నాయకులు, సర్పంచ్‌లు కలిసొచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నాం. రాష్ట్రంలోనే కొడంగల్ ఎత్తయిన ప్రాంతం. నీరు వచ్చే అవకాశం లేకపోయింది. కందులు తప్ప వడ్లు పండించే పరిస్థితి లేదు. ఈ రోజు ప్రతి తండా, ప్రతీ పంచాయతీకి రోడ్డు నిర్మించుకున్నాం. ఇంకా ఎక్కడ ఏం అవసరం ఉన్నా చేసుకుందాం. కార్యకర్తలు, నాయకుల కష్టంతోనే నేను ఈ స్థాయికి వచ్చా.. కొడంగల్ కార్యకర్తల ఆశీర్వాదంతో ముఖ్యమంతి పదవి వచ్చింది.. దేశానికే ఆదర్శ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందాం.

**ఏది కావాలన్నా చేసుకుందాం..**

2,300 ఎకరాల్లో ఇండ్రస్టియల్ పార్కు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఎయిర్‌పోర్టు నుంచి కోస్గి వరకు 300 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించుకుంటున్నాం. 2009లో మీరు నాటిన మొక్క నేడు చెట్టుగా మారింది. సీఎంగా మీముందు కూర్చుంది.. ఏది కావాలన్నా కొదవ లేకుండా చేసుకుందాం'అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్, కార్పొరేషన్ల చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, కల్వ సుజాత, కలెక్టర్ దీపక్‌తివారి తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాట మరో ట్విస్టు



వీసీకే నాలుగు డిమాండ్లు

నూతన ప్రభుత్వంలో తమకు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని వీసీకే సీనియర్ నేత వన్నియరసు పట్టుబట్టారు. ఆ పార్టీ నాలుగు డిమాండ్లు పెట్టినట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు ఒక కేబినెట్ మంత్రిపదవి ఇవ్వాలని, ఎస్సీల సంక్షేమం కోసం చట్టం తీసుకురావాలని, రెండు చోట్ల గెల్చిన విజయ్ ఒకచోట రాజీనామా చేసిన పక్షంలో అక్కడి నుంచి వీసీకే అధినేత తిరుమావళవన్ పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని తేల్చిచెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే, ఏదైనా కీలక శాఖ ఇచ్చేందుకు టీవీకే నాయకత్వం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. వీసీకే అధినేత తిరుమావళవన్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌తో భేటీ నిమిత్తం ఆయన నివాసానికి వెళ్లడంతో కొత్త చర్చను తెరమీదకు వచ్చింది.

మరోవైపు విజయ్ పార్టీకి బయటి నుంచే మద్దతు ఇస్తామని, ప్రభుత్వంలో చేరే ఉద్దేశం లేదని సీపీఎం, సీపీఐ ప్రకటించాయి. డీఎంకేతో ప్రయాణం కొనసాగిస్తామని వెల్లడించాయి. బీజేపీ దొడ్డిదారిన తమిళనాడులోకి అడుగుపెట్టకుండా నిరోధించడానికే టీవీకేకు బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు కమ్యూనిస్ట్ నేతలు స్పష్టంచేశారు. పది రోజుల్లోగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకపోతే రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా, ఐయూఎంఎల్ మద్దతును సైతం కూడగట్టేందుకు టీవీకే నేతలు ప్రయత్నించగా సానుకూల ఫలితం రాలేదు. తాము మొదటి నుంచీ డీఎంకేతోనే ఉన్నామని, వారితో చర్చించకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని ఐయూఎంఎల్ తేల్చిచెప్పింది.

దినకరన్ కొత్త ఎత్తుగడ

ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామి అయిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి దినకరన్ గవర్నర్ ఆర్లేకర్‌ను శుక్రవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో కలవడం కొత్త చర్చకు దారితీసింది. తన పార్టీ నుంచి గెలిచిన ఒకే ఒక్క ఎమ్మెల్యే కామరాజర్ టీవీకేకు మద్దతు ఇచ్చినట్టుగా, ఆయన ప్రస్తుతం కనిపించకుండా పోవడం బట్టి చూస్తే తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు బేరాలు సాగుతున్నాయని గవర్నర్‌కు వివరించారు. విజయ్ పదవీ కాంక్షతో ఉన్నారని, తమ ఎమ్మెల్యే అమ్ముడుపోయాడని అనుమానం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని దినకరన్ కోరడం గమనార్హం. పళని స్వామికి సంపూర్ణ మెజారిటీ ఉందని తెలిపారు. విజయ్ ప్రమాణ స్వీకారం సందిగ్ధంలో పడింది. ఈ నేపథ్యంలో టీవీకే శ్రేణులు, అభిమానులు చెన్నైకి రావొద్దని టీవీకే కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఎస్ఎంఎస్‌లు వెళ్లాయి. నెహ్రూ స్టేడియంలో ప్రమాణ స్వీకారానికి చేపట్టిన ఏర్పాట్లను నిలిపివేశారు.

# భారీ జనసమీకరణకు బీజేపీ కసరత్తు..

ఈకబురు, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వ హించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభను రాష్ట్ర బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ జనసమీకరణతో మోదీ సభ విజయవంతానికి కసరత్తు చేస్తోంది. గతంలో ఎన్నడూ చేయని విధంగా ముందస్తు సన్నాహాలు, ఏర్పాట్లలో పార్టీ ముఖ్య నేతలు నిమగ్నమయ్యారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్ మోదీ సభ కోసం అన్ని జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను, జిల్లా స్థాయి నాయకులను ఇన్‌చార్జ్‌లుగా (ఒక్కో జిల్లాకు పార్టీ నుంచి ఒకరు, ప్రజాప్రతినిధి ఒకరు) నియమించారు.ఏ జిల్లాకు ఆ జిల్లా నుంచి పార్టీ కేడర్, ప్రజలను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేశారు. గతంలో హైదరాబాద్/సికింద్రాబాద్‌లలో మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాల సభ నిర్వహిస్తే చుట్టుపక్కల కొన్ని జిల్లాల నుంచే సమీకరణకు పరిమితమయ్యేవారు. అందుకు పూర్తి భిన్నంగా రాష్ట్ర పార్టీ యావత్ యంత్రాంగం ఇందులో నిమగ్నమైంది.జనసమీకరణకు సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మొదలుకొని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కె.లక్ష్మణ్, ఎం.రఘునందన్‌రావు, అర్వింద్ ధర్మపురి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్‌శంకర్, పైడి రాకేశ్‌రెడ్డి,, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్‌ను సందర్శించిన రాంచందర్‌రావు అక్కడ సాగుతున్న సన్నాహాలు, ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు 2 లక్షల మందితో భారీ జనసమీకరణ చేస్తున్నట్టు వెల్లడించారు. చిక్కడపల్లి: ప్రత్యేక తెలంగాణకు కట్టుబడి ఉండి.. ప్రత్యే కంగా నిధులు ఇస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ సభను జయప్రదం చేయాలని ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి చేపట్టిన బైక్ ర్యాలీని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలతో అభివృది ధ్ పనులు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 10వ తేదీ తర్వాత రాజకీయ పరిణామాలు మారుతాయన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందేనన్నారు. ఈ ర్యాలీలో సికింద్రాబాద్ జిల్లా మహకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు విద్య, వైద్యం, విద్యుత్ భారం తగ్గాలి

2 లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా. 3 సెంట్లు గ్రామాల్లో, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్దిదారులు అంగీకరిస్తే... ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్దీకరించాలి. ఇళ్ల క్రమబద్దీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్ కు పంపాలి... మేం ఆమోదిస్తాం. ఇళ్ల క్రమబద్దీకరణ పూర్తి చేయగలిగితే... విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుంది. గుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలి. వచ్చే కలెక్టర్ల సమావేశంలోగా 22ఏ పెండింగ్ ఉండకూడదు. భూవివాదాల్లో అతిపెద్ద లిటిగెంట్ రెవెన్యూ విభాగమే. 4 లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగులో ఉన్నాయి. ఖాళీగా ఉన్న డీఆర్వోలు, ఆర్డీవోల స్థానాలకు త్వరలో పోస్టింగ్స్ ఇస్తాం. జిల్లా కార్యాలయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడదాం. రీసర్వే ప్రక్రియను 2027 మార్చిలోగా పూర్తి చేయాలి... పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ కావాలి."అని సీఎం ఆదేశించారు.

**కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు**

"బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉంది... దీనిపై కేంద్రంతో మాట్లాడతాం. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడగ జంగాలకు వర్తింప చేయాలి. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనంపై అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతాం. బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం... హాస్టళ్లకు మరమ్మత్తులు చేపట్టాం. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటో నగర్ లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామిక వాడ సిద్ధం అవుతుంది. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి... జీవనోపాధి హబ్‌లుగా వీటిని అభివృద్ధి చేయాలి. జలధార, పశుగ్రాసం సహా వివిధ కార్యక్రమాలను కేంద్ర పథకాలతో ఇంటిగ్రేట్ చేసి అమలు చేయాలి. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు కృషి చేయాలి. విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చుల నుంచి ప్రజలకు ఊరట కలిగించేలా అధికారులు చొరవ చూపాలి. ప్రభుత్వ పథకాలు.. ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజలకు లబ్ది కలుగుతుందనే అవగాహన పెంచాలి. కలెక్టర్ల సమావేశాలు... సమీక్షలు... గంటల తరబడి మీటింగులు అన్నీ ప్రజల కోసమేననే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. పేద, మధ్య తరగతి, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి విషయాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐటీ లాంటి ప్రఖ్యాత సంస్థల్లో బడుగులకు, పేదలకు సీట్లు దక్కించుకునేలా పని చేయాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు అందరికీ సమన్యాయం జరగాలి. అన్ని వర్గాల యువతకూ నైపుణ్యాభివృద్ధి జరగాలి. 11 లక్షల మందికి పైగా కుటుంబాలను పీ4 కింద అడాప్ట్ చేసుకున్నాం. విద్యతో పాటు ఆర్థిక చేయూత, ఉపాధి ఉద్యోగం లాంటి అంశాలతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. 1020 ఫార్ములాతో పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాష్ట్రానికి సౌర విద్యుత్ ఓ గేమ్ చేంజర్,



ఎస్సీ,ఎస్టీలు, బీసీలకు రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ఇస్తున్నాం. ప్రజలకు విద్య కోసం పెడుతున్న ఖర్చు తగ్గించాలి. విద్యా శాఖ ఇటీవల కాలంలో చక్కగా పని చేస్తోంది... ప్రభుత్వ స్కూళ్లల్లో అడ్మిషన్లు పెరిగాయి. ప్రజలు వైద్యంపై పెట్టే ఖర్చును కూడా గణనీయంగా తగ్గించాలి. మెరుగైన వైద్యం అందించాలి. విద్యుత్ ఛార్జీలు తగ్గేలా చేస్తే పేదవారికి మెరుగ్గా ప్రయోజనాలు అందుతాయి. సంక్షేమం, సాధికారిత అనేది నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీరు, వ్యర్థాల నిర్వహణ, గ్యాస్, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లుతో క్లీన్ విలేజ్ గా తీర్చిదిద్దాలి. ప్రజల జీవనప్రమాణాలు పెంచేలా చర్యలు చేపడుతున్నాం. కుటుంబ అవసరాలు, సామాజిక అవసరాలు తీరితే సుస్థిరాభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాం."అని సీఎం వివరించారు.

**ప్రభుత్వ లక్ష్యం... ప్రజల సంక్షేమం**

"నిర్దుష్టమైన తేదీల్లో దీపం2.0 కింద ఇచ్చే సబ్సీడీ డబ్బులు లబ్దిదారులకు ఇచ్చేలా చూడాలి. దీపం2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు మేర ఖర్చు అయ్యింది. దీపం2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారు. స్త్రీశక్తి కింద ఇప్పటి వరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారు. ఏడాదికి రూ. 1940 కోట్లను స్త్రీ శక్తికి ఖర్చు పెడుతున్నాం. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఇస్తున్నాం. మే 19వ తేదీన మత్స్యకారుల సేవలో కార్యక్రమం రూ.286 కోట్ల మేర లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నాం. హాస్టళ్లల్లో ఏదీ వృధా కాకుండా చూడాలి. నెట్ జీరో విధానాన్ని హాస్టళ్లకు వర్తింప చేయాలి. హాస్టళ్ల కిచెన్ల నుంచి వ్యర్థాలను సర్కులర్ ఎకానమీకి అనుసంధానం చేయాలి..

నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లు ఏర్పాటు చేయాలి. కిచెన్, ఫ్రూట్ గార్డెన్లు వచ్చేలా చూడాలి. గిరిజన, ఎస్సీ సంక్షేమ శాఖలో చదువుతున్న విద్యార్థులు ఐఐటీ ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలి. పావలా వడ్డీకే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చదువుకునేలా విద్యారుణం ఇప్పించేలా కార్యాచరణ చేపట్టాలి. విదేశాల్లో ఉద్యోగాలు దక్కించుకునేలా ఎస్సీ,ఎస్టీ యువతకు జర్మన్ భాష నేర్పిస్తున్నాం.

గిరిజన ప్రాంతాల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగును చేపడుతున్నాం...

వ్యాల్యూ అడిషన్ వచ్చేలా ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టాలి. నేచురల్ ఫార్మింగ్, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ లాంటి ప్రక్రియలు కూడా చేపట్టాలి. అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్ గా మారేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి... వీటికి పర్యాటక ప్రాజెక్టులను లింక్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

# తెలంగాణకు జలద్రోహం చేస్తున్న కాంగ్రెస్ ను బొంద పెడుతం

- తెలంగాణ వచ్చిన తర్వాత కూడా మన నీళ్లు దక్కలే
- సమైక్య రాష్ట్రంలో ఆంధ్రోళ్లను నిందించినం.. మన పార్టీ
- మేం అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తాం
- సాగు యోగ్యమైన ప్రతి గుంట భూమికి ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇస్తాం
- నీళ్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిన ద్రోహానికి ప్రజలు వాళ్లను క్షమించరు
- పదేళ్లు అధికారంలో ఉన్న మన బీఆర్ఎస్ పాలకులే మనకు అన్యాయం చేశారు
- పాలమూరు-రంగారెడ్డికి 33 వేల కోట్లు ఖర్చు చేసి 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు
- ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బీఆర్ఎస్ దుర్వినియోగం చేసింది
- దసరా నాటికి పాలమూరు-రంగారెడ్డి పనులను ప్రభుత్వం ప్రారంభించాలి
- లేదంటే ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తాం
- తెలంగాణకు నీటి విషయంలో జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకే తెలంగాణ రక్షణ సేన పుట్టింది
- పాలమూరు-రంగారెడ్డి కి కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలి

**ఈ-కబురు, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రక్షణ సేన ఏర్పడిన తర్వాత మొదటి సారిగా మహబూబ్ నగర్ జిల్లాలో సభ పెట్టుకోవటం సంతోషం. నేను జోగులాంబ అమ్మవారి భక్తురాలిని. మొదటి మీటింగ్ ఇక్కడే పెడతామని గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరు పిడికిలి బిగించిన సరే ప్రజలు మద్దతిచ్చి వారిని గెలిపించారు. ఆ పోరాటాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. అలాగే తెలంగాణ రక్షణ సేన నుంచి నీటి ఉద్యమాన్ని చేపడుతున్నాం.

**తెలంగాణ చరిత్రలో ఇది రాసిపెట్టుకోవాల్సిన రోజు.**

నీళ్ల కోసమే మనం తెలంగాణ పోరాటం చేసిన సంగతి మీ అందరికీ తెలిసిందే. పల్లె పల్లెన పల్లేరు కాయలు మొలిసినయంటూ గతంలో మనం ఆవేదన చెందాం. మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణానది 3 వందల కిలోమీటర్లు పారుతున్న సరే మనకు నీళ్లు రాని పరిస్థితి. బీర బీర కృష్ణమ్మ నీళ్లన్నీ కూడా ఆంధ్రాకే వెళ్లిపోయాయి. తెలంగాణ తెచ్చుకున్నాక 12 ఏళ్లలో ఒక్కటంటే ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదు.

బీమా, నెట్టంపాడు, కోయిల ప్రాజెక్ట్ లను కూడా మనం పూర్తి చేసుకోలేదు. పాలమూరుకు కృష్ణానది నుంచి రావాల్సిన నీళ్లు రాలేదు. బీఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లు గడిచినా కృష్ణా నీళ్లు మనకు రాలేదు. పాలమూరురంగారెడ్డి కోసం 33 వేల కోట్లు ఖర్చు చేసి 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. ఆంధ్రావాళ్లు ఉన్నప్పుడు మనకు నీళ్లు రాకుండా చేస్తున్నారని మనం తిట్టుకున్నాం. కానీ అవసరానికి ఆంధ్రావాళ్లను తిట్టి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ కూడా మనకు చుక్క నీళ్లు తేలేదు. పాలమూరు అంటే మేధావులు, కళాకారులు ఉంటారు. మీరంతా ఒక్క సారి ఆలోచించాలి.

మన పాలకులే మనల్ని మోసం చేశారు. ఇది నిజమా అంటే అక్షరాల నిజం. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే కిరణ్ కుమార్ రెడ్డి జురాల నుంచి నీళ్లు తీసుకునేందుకు జీవో 72 తెచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బేషజాలకు పోయింది. జురాల సోర్స్ పాయింట్ ను శ్రీశైలంకు మార్చింది. బీఆర్ఎస్ పార్టీ చేసింది క్షమించరాని నేరం. ఆ తర్వాత నీళ్లు తీసుకునే ఎత్తును కూడా పెంచారు. బీఆర్ఎస్ లో ఉన్న ఒక గుంటనక్క కాంట్రాక్టర్ తో కుమ్మక్కై నీళ్లు తీసుకునే ఎత్తును పెంచారు. అప్రోచ్ ఛానెల్ 140 మీటర్లు ఉండాల్సింది. కానీ దాన్ని 50 మీటర్లకు కుదించారు. రిజర్వాయర్లు కట్టారు. కానీ అవసరమైనే చిన్న కాలువలు మాత్రం కట్టలేదు. శ్రీశైలం కు సోర్స్ పాయింట్ మార్చటంతో మనకు రోజు ఆంధ్రావాళ్లతో పంచాయితీ అవుతోంది. ఇప్పుడు మనం మీటింగ్ పెట్టుకున్న లక్ష్మీదేవి పల్లిలోని చౌదరి గూడెం తెలంగాణలోనే ఎత్తైన ప్రదేశం. ఇక్కడ రిజర్వాయర్ కడితే రంగారెడ్డి జిల్లాకు 4 లక్షలు, మహబూబ్ నగర్ జిల్లాకు 7 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వవచ్చు. కానీ బీఆర్ఎస్ చేసిన తప్పునే ఇప్పుడు కాంగ్రెస్ కొనసాగిస్తోంది. రిజర్వాయర్లు కట్టి కమిషన్లు దండుకున్నారే తప్ప చుక్క నీళ్లు తేలేదు. మా ప్రభుత్వం కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. అప్పుడు ఇదే ప్రాంతంలో ప్రాజెక్ట్ కడుతామని మీకు మాట ఇస్తున్నా. మాట్లాడితే నల్లమల్ల పులి బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారు. పాలమూరు బిడ్డలు కాంగ్రెస్ కు 12 సీట్లు ఇస్తే ఇప్పటి వరకు కనీసం



తట్టెడు మట్టి కూడా ఎత్తి పోయలేదు. పాలమూరు కు మీరు చేస్తున్న ద్రోహానికి ప్రజలు మీ కాంగ్రెస్ పార్టీ ని కిలోమీటర్ లోతులో బొందపెడుతారు.

**పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, ఇప్పుడున్న కాంగ్రెస్ కూడా దీనికి బాధ్యత తీసుకోకపోతే ఎవరికీ చెప్పుకోవాలి?**

చుక్క నీళ్లు ఇవ్వకుండా మోటార్లు, పంప్ లు అంటూ 6 వేల కోట్లు ఖర్చు చేశారు. కక్కుర్తితో కమిషన్లు తిని ప్రజలకు అన్యాయం చేశారు. ఈ పాపంలో జిల్లాలోని అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భాగం ఉంది. దసరా వరకు మీకు టైమ్ ఇస్తున్నాం. లక్ష్మీదేవి పల్లిలో రిజర్వాయర్ కట్టాల్సిందే. లేదంటే దసరా తెల్లారి నుంచే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తాం.నేను చేసిన విమర్శలతో రేపటి నుంచి గులాబీ దండు నాపై ఆటాక్ చేస్తారు. కానీ మనం ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించి చాలా జిల్లాల్లో ఒక్క ప్రాజెక్ట్ కట్టలేదు. ఆదిలాబాద్ లో తుమ్మిడి హెట్టి, వార్ధా కడుతామని చెప్పి అది కట్టలేదు.

**నిజామాబాద్ లో కొత్తగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు.**

కరీంనగర్ లో ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్ట్ లకు ఆయకట్టు స్థిరీకరణ మాత్రమే చేశారు. ఒక్క మెదక్ జిల్లాలో మాత్రమే లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చారు. వరంగల్ లో కనీసం ఒక్క కొత్త ప్రాజెక్ట్ కట్టలేదు. 25 ఏళ్లుగా దేవాదుల కూడా పూర్తి చేస్తలేరు. నల్గొండలో ఒక్క కొత్త రిజర్వాయర్ లేదు. దిండికి కూడా నీళ్లు ఇవ్వాల్సి ఉన్న ఇవ్వలేదు. నల్గొండ జిల్లాకు నీళ్లు ఇచ్చేందుకు పాలమూరురంగారెడ్డి ని లింక్ చేస్తున్నారు. ఇవ్వాళ పేపర్లో వార్త చూస్తే బాధనిపించింది. కృష్ణాలో ఆంధ్రావాళ్లు 770 టీఎంసీలు వాడుకున్నారు. మనం 221 టీఎంసీలు మాత్రమే వాడుకున్నాం. మన దగ్గర పారుతున్న కృష్ణానది నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నాయి. వాళ్లను మనం అనాల్సిందేమీ లేదు. తెలివిగా డ్యామ్ లు, చెక్ డ్యామ్ లు కట్టుకున్నారు. వాళ్ల ప్రజలకు మేలు చేసేందుకు అవినీతి చేయకుండా పనులు చేసుకున్నారు. బీఆర్ఎస్ కు పదేళ్లు ప్రజలు ఇచ్చిన అవకాశం పోగొట్టుకుంది. కాంగ్రెస్ రెండున్నరేళ్లు గడిచిన సరే బుద్ధి తెచ్చుకోవటం లేదు.కొడంగల్ నారాయణ పేట్ మక్తల్ పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి అంటున్నాడు. రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే దాన్ని లక్ష ఎకరాలకు కుదించారు. అసలు ముఖ్యమంత్రి మొత్తం పాలమూరును కదా ముందు పూర్తి చేయాలి. కానీ అది చేయటం లేదు. నీటి విషయంలో జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకే తెలంగాణ రక్షణ సేన పుట్టింది. మేము అధికారంలోకి వచ్చాక జురాలను సోర్స్ గా తీసుకొని 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం చేస్తాం ,జురాలలో వరద నీళ్లు ఉంటాయి. ఎంత దమ్ముంటే అంత ఎత్తి పోసుకోవచ్చు. పేరుకు 2 టీఎంసీలే అంటారు. కానీ మనం ఐదు టీఎంసీలను 35రోజుల పాటు ఎత్తిపోసుకోవచ్చు. చేసే అవకాశం మనకు ఉన్నప్పటికీ పాలకులకు ఆ మనసు లేదు. ఇప్పుడు చెరువులు నింపి వదిలేస్తున్నారు. నిండిన చెరువులను పర్యవేక్షించేందుకు లష్కర్ లను నియమిస్తాం. వాళ్లు చెరువుల నుంచి నీళ్లు పొలాల వద్దకే వెళ్లే వరకు పర్యవేక్షిస్తారు. వాటర్ కమిషన్ ను కూడా నియమిస్తాం. ఇరిగేషన్, వాటర్ మేనేజ్ మెంట్ ను వాటర్ కమిషనే చూసుకుంటుంది. మీకు ప్రమాణం చేసి నేను మాట ఇస్తున్నా. నీళ్ల కోసం చేస్తున్న ఉద్యమానికి మాకు మద్దతివ్వండి. పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా ఇవ్వాల్సిన బీజేపీ కూడా మోసం చేస్తోంది. ఇక్కడి ఎంపీ అరుణమ్మ గారు 10 తారీఖున ఇక్కడకు వస్తున్న మోడీని అడిగి మనకు జాతీయ హోదా తేవాలి. జాతీయ హోదా తో పాటు, జనగణనలో బీసీ కాలమ్ ఉండాలి, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బీసీ బిల్లుకు ఆమోదం తెలుపాలని ప్రధాని మోడీని డిమాండ్ చేస్తున్నా.

# ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్

**... బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**

ఈకబురు,: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి హోంమంత్రిగా కూడా అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఆయన ధ్వజమెత్తారు. 2024 ఎన్‌సీఆర్‌బీ (NCRB) గణాంకాలు రాష్ట్రంలో నేరాల భయానక పరిస్థితిని కళ్లకు కడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే సైబర్ నేరాలు 49 శాతం పెరగడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు.తెలంగాణలో మిస్సింగ్ కేసుల సంఖ్య కూడా ఆందోళనకరంగా పెరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. 2024 సంవత్సరంలో ఏకంగా 25,500 మంది అదృశ్యమయ్యారని వారిలో వేలాది మంది ఆచూకీ ఇప్పటికీ లభించలేదని వివరించారు. ప్రతి రోజూ సగటున ఆరుగురు చిన్నారులు మాయమవుతున్న పరిస్థితి రాష్ట్రాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోందని అన్నారు. కిడ్నాప్‌లకు గురవుతున్న వారిలో అత్యధిక శాతం చిన్నారి బాలికలే ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. మహిళల రక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని క్షేత్రస్థాయిలో నేరాలు 24,495కు పెరగడమే ఇందుకు సాక్ష్యమని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న వరుస నేర ఘటనలు పోలీస్ వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. కరీంనగర్‌లో పట్టపగలు జరిగిన నగల దుకాణం దోపిడీ దొంగలను పట్టుకోవడంలో ప్రభుత్వం సాకులు వెతుకుతోందని ఎద్దేవా చేశారు. అందరూ చూస్తుండగానే ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలపై దాడులు జరగడం రాష్ట్రాన్ని అరాచకంలోకి నెట్టేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ క్వార్టర్స్‌లో ఏకంగా ఒక ఐపీఎస్ అధికారి భార్య హత్యకు గురవ్వడం శాంతిభద్రతలు ఏ స్థాయిలో దిగజారాయో స్పష్టం చేస్తోందన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ సుమతి గారు నిర్వహించిన ఆపరేషన్‌తో హైదరాబాద్‌లో మహిళల భద్రత డొల్లతనం బయటపడిందని గుర్తుచేశారు.మానవ అక్రమ రవాణా కేసుల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం సిగ్గుచేటని హరీశ్ రావు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 1.65 లక్షలుగా ఉన్న నేరాల సంఖ్య ప్రస్తుతం 2.17 లక్షలకు చేరిందని గణాంకాలతో వివరించారు. రాష్ట్రంలో క్రైమ్ రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గాలపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్లిష్టమైన కేసులను కూడా గంటల వ్యవధిలో ఛేదించేవారని కానీ ప్రస్తుతం నిందితులు యథేచ్ఛగా తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం కేవలం రాజకీయ కక్షసాధింపులు మీడియా మేనేజ్‌మెంట్‌పైనే దృష్టి పెట్టిందని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మర్చిపోయిందని హరీశ్ రావు విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లు కమాండ్



కంట్రోల్ సెంటర్ల సమీక్షలు ఫోటోలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయకుండా కేవలం ప్రచారం కోసం పాకులాడటం మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి సైబర్ నేరాలు మిస్సింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టవద్దని

# బెంగాల్‌లో తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి



ఈకబురు, : భాజపా శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో అమిత్‌షా సమక్షంలో భాజపా శాసనసభాపక్ష సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సువేందును బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా అమిత్ షా ప్రకటించారు. రేపు బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది.

**కౌన్సిలర్ స్థాయి నుంచి..**

సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 200609 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు.

**నందిగ్రామ్ ఉద్యమంతో..**

సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు.

**తృణమూల్ గూటిని వీడి..**

తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.



# ఇకపై బెంగాల్ అభివృద్ధి మా బాధ్యత: అమిత్ షా

ఈకబురు, : కేంద్రమంత్రి అమిత్ షా టీఎంసీ అధినేత మమతా బెనర్జీపై తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్ ఐదు దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య క్షీణత, శాంతి భద్రతల పతనంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొందని అన్నారు. టీఎంసీ ఓటమితో అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. సువేందు అధికారి మమతను ఆమె సొంత నియోజకవర్గంలోనే ఓడించారని పేర్కొన్నారు. తాము సాధించిన ఈ అసాధారణ విజయాన్ని బెంగాల్ ఎన్నికల చరిత్రలోనే కీలక మలుపుగా అభివర్ణించారు. ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు పార్టీపై ఉందని.. ఇక బెంగాల్ అభివృద్ధి బాధ్యత తమదేనని అన్నారు. శాంతియుతంగా పోలింగ్ నిర్వహించినందుకు ఎన్నికల సంఘం, భద్రతా దళాలు, రాష్ట్ర అధికారులను అమిత్ షా అభినందించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వరుస ఓటములు ఎదుర్కొంటోందని.. దీనిపై ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకోని నాయకులు ఎప్పటికీ నిజమైన విజయాన్ని సాధించలేరని పేర్కొన్నారు. సువేందు నేతృత్వంలోని నూతన ప్రభుత్వం బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## మూసీ ప్రాజెక్టు తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు



ఈకబురు, హైదరాబాద్:
మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డీపీఆర్ వివరాలను మంత్రులకు అధికారులు అందజేశారు. తొలిదశలో చేపట్టే పనులకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)తో చర్చలు ముగిశాయని ఉపసంఘానికి తెలిపారు. తొలిదశలో రూ.7,055 కోట్లతో మూసీ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

## హైడ్రా యాక్షన్ ప్లాన్.. ఇక వరదలకు చెక్



. వానాకాలం ముందే రంగంలోకి హైడ్రా
ఈకబురు,, హైదరాబద్ ;
హైదరాబాద్ నగరంలో వర్షాకాలం దృష్ట్యా ఎదురయ్యే వరద సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా యంత్రాంగం సమరోత్సాహంతో సిద్ధమవుతోంది. రాబోయే వానాకాలం సీజన్‌కు మరో నెల రోజుల సమయం ఉండగానే క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**రెండు దశాబ్దాల తర్వాత సమగ్ర పూడికతీత**

నగరంలోని డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించి కమిషనర్ కీలక విషయాలను ప్రస్తావించారు. గత 20 ఏళ్ల క్రితం మాత్రమే నాలాల్లో ఒక పద్ధతి ప్రకారం సమగ్రంగా పూడికతీత పనులు జరిగాయని పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ఈ ప్రక్రియ సరిగ్గా జరగకపోవడంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లే మార్గాలు మూసుకుపోయాయని అభిప్రాయపడ్డారు. ఈసారి మాత్రం పరిస్థితిని చక్కదిద్దేందుకు యుద్ధ ప్రాతిపదికన డిసల్టింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలం నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి నగర ప్రజలకు వరద గండం లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు.

**కీలక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

గతంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి అక్కడి పరిస్థితులను స్వయంగా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పరిధిలోని వెంకటగిరి, యూసఫ్ గూడా, కృష్ణానగర్, బోరబండ సహా మైత్రివనం వంటి అత్యంత రద్దీ ప్రాంతాల్లో వరద నివారణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ ఏరియాల్లో వర్షపు నీరు నిలవకుండా అడుగులు వేగంగా వేస్తున్నట్లు రంగనాథ్ వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.

**అక్రమ నిర్మాణాలపై కొరడా**

నాలాలపై వెలిసిన అక్రమ నిర్మాణాలు వరద ముప్పునకు ప్రధాన కారణంగా మారుతున్నాయని కమిషనర్ రంగనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నాలా మార్గాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మరిన్ని నిర్మాణాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అలాంటి అక్రమ నిర్మాణదారులకు త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నాలా ఆక్రమణల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

**ప్రజల భద్రతే ప్రాధాన్యం**

ప్రతి ఏటా వానాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు పడుతున్న అవస్థలను గమనిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. నీటి నిల్వలను అడ్డుకునే ప్రతి అడ్డంకిని తొలగించడమే తమ లక్ష్యమని తెలిపారు. నగర డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం ద్వారా భవిష్యత్తులో వరద నీరు రోడ్లపైకి

## డీజీపీని కలిసిన బీఆర్ఎస్ నేతలు

**.. బండి సంజయ్‌పై ఫిర్యాదు.. క్రిమినల్ కేసుకు డిమాండ్**

ఈకబురు, హైదరాబాద్ :
కరీంనగర్ ఘటనల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం డీజీపీ సీ.వీ.ఆనంద్ ను కలిశారు. బీఆర్ఎస్ నేతలపై జరుగుతున్న వరుస దాడులను ప్రస్తావించారు. కరీంనగర్ లో జరిగిన దాడులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కు సంబంధం ఉందని ఆరోపిస్తూ ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిర్యాదును డీజీపీకి అందచేశారు. కరీంనగర్ లో గురువారం బీఆర్ ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుతో పాటు ఆయన క్యాంప్ ఆఫీస్, మరో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర రెడ్డి, కే.పీ. వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్ , డాక్టర్ దాసోజు శ్రవణ్ , కల్వకుంట్ల సంజయ్ లు డీజీపీని కలిశారు. కౌశిక్ రెడ్డికి భద్రత కల్పించాలని కోరారు. దాంతోపాటు కరీంనగర్ లో జరిగిన హింసాత్మక సంఘటనలకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ని నిందితునిగా చేర్చాలని డిమాండ్ చేశారు.బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల బండి సంజయ్ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలపై విడిగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కేసులో నిష్పాక్షిక దర్యాప్తు జరిగేందుకు సీనియర్ అధికారికి అప్పగించాలని పేర్కొన్నారు. బాధిత ఎమ్మెల్యే, ప్రత్యక్ష సాక్షుల స్టేట్ మెంట్లు రికార్డు చేసి నిర్ణీత కాలవ్యవధిలో విచారణ పూర్తి చేయాలన్నారు. కరీంనగర్ లో బీజేపీ కార్యకర్తలు దాడులు చేసినా వారిని అడ్డుకోలేక పోయిన పోలీసులతోపాటు ఎఫ్ఐఆర్ ను తారుమారు చేసిన అధికారులపై క్రిమినల్ , క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఎంజే జువెలరీ షాపు దోపిడీని నివారించటంలో విఫలమైన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. పట్టపగలు దోపిడీ దొంగలు కాల్పులు జరిపి మరీ జువెలరీ షాపులో దోపిడీ చేశారని.. తాజాగా రిటైర్డ్ డీజీ భార్యను దారుణంగా హత్య చేసి లూటీకి పాల్పడ్డారని అంటూ లా అండ్ ఆర్డర్ ఇదేనా? అని ప్రశ్నించారు. ఓవైపు వరుసగా నేరాలు జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు తరుచూ వెళ్తూ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

# ఆరు రెట్లు పెరిగిన ఏఐ వినియోగం.. 20% ఉద్యోగులకు లేఆఫ్‌లు

ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ 'క్లౌడ్‌ఫ్లేర్' తమ లేఆఫ్‌లను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ సిబ్బందిని 20శాతం మేర తగ్గించుకుంటున్నట్లు వెల్లడించింది. కంపెనీలో ఏఐ వినియోగం భారీగా పెరగడం వల్లే ఈ తొలగింపుల (Cloudflare Layoffs) ప్రక్రియ చేపట్టినట్లు తెలిపింది. ఈమేరకు ఉద్యోగులకు ఇంటర్నల్ మెమో పంపింది. దాదాపు 1100 మందికి పైగా ఉద్యోగులను 'క్లౌడ్‌ఫ్లేర్ (Cloudflare)' తొలగించనుంది."గత మూడు నెలల్లో కంపెనీ ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగింది. ఇంజినీరింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్ విభాగాల్లో నిత్యం వేల సంఖ్యలో ఏఐ ఏజెంట్లను వినియోగిస్తున్నాం. ఏఐ సామర్థ్యాన్ని మరింత అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే కంపెనీ ఈ పునర్ వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. అంతేగానీ, ఉద్యోగుల పనితీరుతో దీనికి ఎలాంటి సంబంధం లేదు" అని క్లౌడ్‌ఫ్లేర్ తమ మెమోలో పేర్కొంది. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులకు పరిహార ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

**హెల్త్‌కేర్, స్టాక్ బెనిఫిట్స్..**

**స్వచ్ఛందంగా వైదొలిగే వారికి మైక్రోసాఫ్ట్ ఆఫర్**

కాగా.. క్లౌడ్‌ఫ్లేర్ గురువారమే తన తొలి త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. ఇందులో వాల్‌స్ట్రీట్ అంచనాలను మించి కంపెనీ రాణించింది. అయితే, కొన్ని గంటలకే ఈ లేఆఫ్‌ల వార్తలు బయటకు రావడంతో.. కంపెనీ షేర్లు భారీగా పడిపోయాయి. ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే క్లౌడ్‌ఫ్లేర్ షేరు ధర దాదాపు 14శాతం కుంగడం గమనార్హం.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు .. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతలు భగ్గుమనడంతో మన సూచీలు నష్టాల్లో కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు అందుకు దోహదం చేశాయి. ఉదయం సెన్సెక్స్ 77,631 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఒక దశలో సూచీలు స్వల్పంగా లాభపడినా.. తర్వాత వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 516 పాయింట్ల నష్టంతో 77,328 వద్ద ముగిసింది. నిఫ్టీ 150 పాయింట్లు కోల్పోయి, 24,176 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.47 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టైటాన్ కంపెనీ, అపోలో హాస్పిటల్, ఏషియన్ పెయింట్స్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, అదానీ పోర్ట్స్ షేర్లు రాణించగా.. ఎస్‌బీఐ, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టాల్లో కదలాడాయి.

## ఎయిరిండియాలో వేతనం లేని సెలవులు!

**బోనస్ వాయిదా , వ్యయ నియంత్రణపై బోర్డులో చర్చలు**




దిల్లీ: ఉద్యోగులకు తాత్కాలిక సెలవులు ఇవ్వడం, బోనస్ వాయిదా వేయడం సహా పలు వ్యయ నియంత్రణ చర్యలపై ఎయిరిండియా బోర్డు సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల విమాన ఇంధన ధర పెరగడం, విదేశీ మార్గాల్లో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నందున సంస్థ పలు ఇబ్బందులను ఎదుర్కొంటుండం ఇందుకు నేపథ్యం. గత ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా గ్రూప్‌నకు రూ.22,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అంచనా. హరియాణాలోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉదయం 11:30 గంటలకు బోర్డు సమావేశం మొదలైందని, మూడు గంటల పాటు అది కొనసాగిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. చర్చలు ఏ అంశాలపై జరిగాయన్నది కంపెనీ బయటకు వెల్లడించలేదు. అయితే 202526 ఆర్థిక గణాంకాలు, వ్యయ నియంత్రణ చర్యలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఉద్యోగులను వేతనం లేని సెలవుల్లోకి పంపడంతో పాటు బోనస్ చెల్లింపు వాయిదా తదితరాలనూ పరిశీలించినట్లు తెలుస్తోంది. బోర్డుకు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. కొత్త సీఈఓ ఎంపికపైనా..కొత్త సీఈఓ ఎంపిక అంశం కూడా చర్చకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుత సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ ఈ ఏడాదిలోనే నిష్క్రమిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమావేశ వివరాలను క్యాంప్‌బెల్ విల్సన్ శుక్రవారం వెల్లడించే అవకాశం ఉంది.

## ఏఐతో సేవల విపణికి ఇబ్బంది లేదు కోఫోర్జ్ సీఈఓ సుధీర్ సింగ్



దిల్లీ: వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత, సంప్రదాయ 'లేబర్ యాజ్ ఎ డిఫాల్ట్' మోడల్‌ను దెబ్బతీస్తున్నా, ఐటీ సేవల పరిశ్రమను కుంచించుకుపోయేలా చేయడం లేదని కోఫోర్జ్ సీఈఓ సుధీర్ సింగ్ అభిప్రాయపడ్డారు. మార్చి త్రైమాసికంలో రూ.4450.4 కోట్ల ఆదాయంపై రూ.612.3 కోట్ల నికర లాభాన్ని ఈ కంపెనీ సాధించింది. 202425 ఇదే సమయంతో పోలిస్తే లాభం రెట్టింపు కాగా, ఆదాయం 30% పెరిగింది. ఎర్నింగ్స్ కాల్‌లో సుధీర్ మాట్లాడుతూ 'ఏఐ వల్ల అధిక మార్జిన్ ఉండే ఆర్డర్లు వస్తున్నాయి. ఏఐ ఆధారిత కోడ్‌ను నిర్మించడం చౌక. నిర్వహించడం, భద్రంగా చూసుకోవడం, సొంతం చేసుకోవడం వ్యయంతో కూడుకున్నది. 20 ఏళ్ల కిందట క్లౌడ్ మైగ్రేషన్ జరిగినట్లే, ఏఐ కూడా భారీ స్థాయిలో మేనేజ్డ్ సర్వీసెస్ లైన్‌ను సృష్టించగలదు. ఒక్కసారి ఈ వ్యవస్థలు కార్యరూపంలోకి వచ్చాక, ఈ మోడళ్లను ఎవరో ఒకరు పర్యవేక్షించాలి. ఏజెంట్లకు తిరిగి శిక్షణ ఇవ్వాల'ని వివరించారు.

## ఈసీఎల్‌జీఎస్ 5.0 కింద రూ.80,000 కోట్ల రుణాలు: ఎస్‌బీఐ


ప్రభుత్వం ప్రకటించిన ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ (ఈసీఎల్‌జీఎస్) 5.0 పథకం కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.80,000 కోట్ల వరకు రుణాలు అందిస్తుందని బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి గురువారం వెల్లడించారు. మార్గదర్శకాలు వచ్చినందున ఈ పథకానికి అర్హులైన వినియోగదారుల జాబితా తమకు తెలుసని, వారికి రూ.70,00080,000 కోట్ల రుణ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో ప్రభావితమైన వ్యాపారాలకు అదనపు నిర్వహణ మూలధన మద్దతు అందించేందుకు, కేంద్ర మంత్రివర్గం ఇటీవల రూ.2.55 లక్షల కోట్లతో ఈసీఎల్‌జీఎస్ 5.0కు ఆమోదం తెలిపింది.

## విజయవాడలో బిర్లాన్యూ ఎక్స్‌పీరియన్స్ సెంటర్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బిర్లాన్యూ తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ని విజయవాడ ఎంజీ రోడ్డులో గురువారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అక్షత్‌సేథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతున్న ప్రాంతానికి విజయవాడ కేంద్రంగా నిలుస్తోంది. అందుకే ఇక్కడ ఈ కేంద్రాన్ని ప్రారంభించాం. ఆర్కిటెక్ట్‌లు, గుత్తేదారులు, గృహ యజమానులు తమకు కావాల్సిన ఉత్పత్తులను ప్రత్యక్షంగా పరిశీలించి, ఎంపిక చేసుకోవచ్చు. గోడలు, ఫ్లోరింగ్, పైపులు, నిర్మాణ రసాయనాలతో పాటు బిర్లాన్యూకు సంబంధించిన అనేక ఉత్పత్తులను ఇక్కడ పరిశీలించొచ్చు. ఇతరుల సిఫారసులకు బదులు, సొంతంగా నాణ్యత, ధరలను తెలుసుకోవచ్చు' అని అక్షత్‌సేథ్ తెలిపారు. దక్షిణ భారతదేశంలో తయారీ, పంపిణీ వ్యవస్థను విస్తరిస్తూ వస్తున్నామని, వినియోగదారులను ప్రత్యక్షంగా చేరుకునేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు.

## ఆ అబద్ధమే ఇంకా చెబుతున్నారు .. కియోసాకి ఆందోళన



ఇన్వెస్టర్ గురూ, 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి తాజాగా చేసిన ఫేస్‌బుక్ పోస్టులో ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "స్కూల్‌కి వెళ్లి, ఉద్యోగం సంపాదిస్తే భద్రత ఉంటుంది" అనే అత్యంత ఖరీదైన అబద్ధాన్ని ఇప్పటికీ 2026లోనూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చెబుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.కియోసాకి పేర్కొన్న వివరాల ప్రకారం, 2025 సంవత్సరం ఉద్యోగుల పాలిట అత్యంత కఠినమైన కాలంగా మారింది. ఆ ఒక్క సంవత్సరంలోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఉద్యోగాల కోతలు నమోదయ్యాయని, ఇది 2020 తర్వాత అత్యధికమని ఆయన తెలిపారు. అలాగే 2026 జనవరిలోనే 1,08,435 ఉద్యోగాలు ఊడిపోయాయనిఇ చెప్పారు.టెక్నాలజీ రంగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని కియోసాకి పేర్కొన్నారు. 2026లో ప్రతిరోజూ సగటున 1,003 మంది టెక్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. అమెజాన్ జనవరిలో 16 వేల ఉద్యోగాలను తొలగించగా, మెటా మే నెలలో మరో 8 వేల ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని చెప్పారు. చెవ్రాన్ 8 వేల మందిని, డెల్ 11 వేల మందిని, సిటీగ్రూప్ 20 వేల మందిని తొలగించిందని, స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూతపడటంతో 17 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆయన వివరించారు.ఈ పరిస్థితులకు కృత్రిమ మేధస్సు (AI) ప్రధాన కారణంగా మారుతోందని కియోసాకి అభిప్రాయపడ్డారు. ఒక్క 2025లోనే ఏఐ కారణంగా అమెరికాలో 55 వేల ఉద్యోగాలు పోయాయని, 2026 ఏప్రిల్‌లో జరిగిన ఉద్యోగ కోతల్లో 26 శాతం ఏఐ కారణంగానే జరిగాయని ఆయన పేర్కొన్నారు."ఇవేవీ విఫలమైన కంపెనీలు కావు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సంస్థలు. అయినా అత్యంత చదువుకున్న, నైపుణ్యం కలిగిన ఉద్యోగులే తొలగింపులకు గురవుతున్నారు" అని కియోసాకి వ్యాఖ్యానించారు. ఉద్యోగ భద్రత అనేది అసలు ఎప్పుడూ నిజం కాదని, ఉద్యోగంపై మాత్రమే ఆధారపడటం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.తన తండ్రి ఉదాహరణను ప్రస్తావిస్తూ, "నా తండ్రి పీహెచ్‌డీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగి. ఒక్కరోజు కూడా పని మానలేదు. అయినా చివరికి అప్పులతోనే మరణించారు" అని ఆయన అన్నారు. విద్యాసంస్థలు మంచి ఉద్యోగులుగా తయారు చేస్తాయని, కానీ డబ్బు ఎలా పనిచేస్తుందో మాత్రం నేర్పవని విమర్శించారు. డబ్బు వ్యవస్థపై మాట్లాడుతూ, "సేవింగ్స్‌లో డబ్బు ఉంచడం వల్ల ద్రవ్యోల్బణం నెమ్మదిగా దాన్ని తినేస్తుంది. ఉద్యోగుల ఆదాయం ఆగిపోయినప్పుడు వారికి ఆదాయం ఇచ్చే ఆస్తులు లేకపోవడమే అసలు సమస్య" అని ఆయన తెలిపారు.తన చిన్నప్పుడే "రేపు ఉద్యోగం పోతే నీ ఆస్తుల ద్వారా ఎంతకాలం జీవించగలవు?" అని తన 'రిచ్ డ్యాడ్' అడిగిన ప్రశ్నను గుర్తుచేసుకున్న కియోసాకి, ఉద్యోగ భద్రత గురించి ఆలోచించే వారికంటే, "నేను ఏ ఆస్తిని నిర్మిస్తున్నాను?" అని ఆలోచించే వారే భవిష్యత్తులో నిలబడతారని పేర్కొన్నారు."ప్రపంచం మారిపోయింది. కానీ పాత సలహాలు మాత్రం మారలేదు. ఏఐ విప్లవం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది" అని కియోసాకి తన పోస్టులో హెచ్చరించారు.

## 150 ఎయిర్‌బస్ విమానాల కోసం ఎయిరేషియా భారీ ఆర్డర్

**విలువ రూ.1.79 లక్షల కోట్లు**




కౌలాలంపూర్: చౌక ధరల విమానయాన సంస్థ ఎయిరేషియా, ఎయిర్‌బస్ ఏ220300 మోడల్ విమానాలు 150 సమీకరించేందుకు ఆర్డర్ ఇచ్చింది. ఈ లావాదేవీ విలువ 19 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.79 లక్షల కోట్లు). ఏ220 విమానాల కోసం ఒక సంస్థ ఇచ్చిన అతిపెద్ద ఆర్డరు ఇదే. కెనడాలోని క్యూబెక్, మిరాబెల్‌లో ఉన్న ఎయిర్‌బస్ ఫ్యాక్టరీలో గురువారం ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ పాల్గొన్నారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరలు, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి.. విమాన ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకునే ఏ220 విమానాలు కొనుగోలు చేయాలని ఎయిరేషియా నిర్ణయించింది. ఈ విమానాలు తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేస్తాయి. 160 సీట్ల సామర్థ్యం కలిగిన ఈ విమానాలను, తక్కువ మంది ప్రయాణికులతో కూడా లాభదాయకంగా నడపొచ్చు. చిన్న నగరాలు, సెకండరీ హబ్‌లకు విమాన సేవలు ప్రారంభించడానికి వీలుపడుతుందని సంస్థ పేర్కొంది. భవిష్యత్తులో ఈ ఆర్డరును 300 విమానాల వరకు పెంచుకునే సౌలభ్యం ఎయిరేషియాకు ఉంది. ఈ విమానాల డెలివరీ 2028 నుంచి ప్రారంభమవుతుంది. ఆగ్నేయాసియా, ఆసియాపసిఫిక్ ప్రాంతాల్లోని గమ్యస్థానాలకు ఏ220 విమానాలను ఎయిరేషియా నడపనుంది. మధ్యస్థ దూర మార్గాలకు ఏ320, ఏ321 విమానాలను, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా వంటి సుదూర మార్గాలకు ఏ330 విమానాలను కేటాయించే అవకాశం ఉందని ఎయిరేషియా సహవ్యవస్థాపకుడు, సలహాదారు టోనీ ఫెర్నాండెజ్ పేర్కొన్నారు. ఈ భారీ ఆర్డరుతో ఎయిర్‌బస్ ఏ220 విమానాల మొత్తం ఆర్డర్ల సంఖ్య 1,000 మార్కును దాటింది. 2026 మార్చి వరకు చూస్తే, 25 విమానయాన సంస్థలకు 501 ఏ220 విమానాలను ఎయిర్‌బస్ అందించింది.

## రూ.4,000 కోట్ల వార్షిక ఆదాయ వృద్ధే లక్ష్యం కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి



దిల్లీ: 'ఇండియా పోస్ట్ వార్షిక ఆదాయ వృద్ధి ఇదివరకు రూ.200 కోట్లు ఉండేది. ఇప్పుడు రూ.2,000 కోట్లకు చేరింది. వచ్చే ఏడాది కాలంలో రూ.4,000 కోట్ల ఆదాయ వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇక్కడి నెహ్రూ ప్లేస్‌లో ఆధునికీకరించిన పోస్టాఫీస్‌ను కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాలతో కలిసి గురువారం ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడారు. 'తపాలా శాఖ ఇక మీదట ఉత్తరాలు, పార్సిళ్ల బట్వాడాకే పరిమితం కాదు. ఆర్థిక, డిజిటల్, పౌరసేవలకు కేంద్రబిందువుగా మారబోతోంది. ఈ శాఖ ఆధునికీకరణకు రూ.5,000 కోట్లతో ఐటీ మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పోస్టాఫీసుల పనివేళలు పెంచడంతో పాటు యూపీఐ సేవలు అందిస్తున్నాం. 6 ప్రధాన మెట్రోనగరాల్లో 24, 48 గంటల స్పీడ్‌పోస్టు సేవలు అందుబాటులోకి తెచ్చాం' అని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల నుంచి 11%వాటా: స్కోడా ఇండియా



హైదరాబాద్: ఐరోపా కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా, గతేడాది 107% వృద్ధితో 72,665 కార్లు విక్రయించినట్లు సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశీష్ గుప్తా తెలిపారు.హైదరాబాద్‌లో కొత్త విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశీయ విక్రయాల్లో తెలంగాణ నుంచి 7%, ఆంధ్రప్రదేశ్ నుంచి 45% చొప్పున..సగటున 1112% వాటా లభిస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ 36 టచ్ పాయింట్లుండగా, 6 నెలల్లో హైదరాబాద్‌లో మరో 2 సర్వీస్ సెంటర్లు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. తాజా మోడల్ కైలాక్, కుషాక్, స్లావియాలలో 8085% స్థానిక విడిభాగాలనే ఉపయోగిస్తున్నామని, దీంతో సర్వీసింగ్ ఖర్చులు తగ్గాయని గుప్తా తెలిపారు.



# విజయ్ మౌనం నాకు నచ్చదు...త్రిష

ఎన్నికల్లో పోటీ చేసిన మొదటిసారే ఘన విజయాన్ని సాధించారు నటుడు విజయ్ (Vijay). తమిళ ప్రజలు టీవీకే పార్టీకి స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సమస్యలు ఎదురవుతోన్న విషయం తెలిసిందే. ఇంతటి ఉత్కంఠ పరిస్థితుల్లోనూ విజయ్ మౌనంగా ఉండటాన్ని అందరూ చర్చించుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఆయనతో కలిసి 5 సినిమాల్లో నటించిన త్రిష (Trsiha) గతంలో విజయ్ మౌనంపై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. విజయ్ అందరి దృష్టిని ఆకర్షిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే 'సైలెంట్ కిల్లర్'. అతడు ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆయన్ని అందరూ ఇష్టపడతారు.నిజం చెప్పాలంటే 'గిల్లి' సినిమా సమయంలో మా ఇద్దరి మధ్య అంత మంచి అనుబంధం ఉండేది కాదు. దర్శకుడు ధరణి, టీమ్ వల్ల మేము మంచి స్నేహితులమయ్యాం.విజయ్ చాలా మంచి వ్యక్తి. ఎప్పుడూ సహనంతో ఉంటాడు. నా జీవితంలో నేను ఎప్పుడూ ఇష్టపడే వ్యక్తుల్లో విజయ్ ఒకరు.సెట్‌లో ఉన్నప్పుడు విజయ్ అందరితో మాట్లాడకుండా ఓ మూల కూర్చొని గంటలతరబడి గోడ వైపు చూస్తూ ఉంటాడు. నాకు తనలో ఆ మౌనం నచ్చదు.నా దృష్టిలో హోమ్ అంటే ఇల్లు మాత్రమే కాదు, అది ఒక వ్యక్తి. నాకు అలాంటి వ్యక్తి విజయ్. అతడితో ఉంటే నాకు చాలా సేఫ్టీగా అనిపిస్తుంది.ప్రస్తుతం తమిళనాడులో రాజకీయ సంక్షోభం నెలకొన్న తరుణంలో.. త్రిష అన్నట్లుగానే తన 'మౌనం'తోనే విజయ్ ఈ రాజకీయ చదరంగంలో ఎలాంటి ఎత్తుగడలు వేయబోతున్నారో అని అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.ఈ



## స్త్రీ అంటే ఓర్పు: జయసుధ



మహిళల బాధ్యతలు, బాధల కలబోతే 'నేను' ప్రాజెక్టు అని ప్రముఖ నటి జయసుధ (Jayasudha) తెలిపారు. 'స్త్రీ అంటే ఓర్పు. ప్రతి క్షణం బాధ్యతల గురించి ఆలోచిస్తుంటుంది' అని పేర్కొన్నారు. హృదయాల్ని హత్తుకునే కథలను చెప్పేందుకు, కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు 'కథా సుధ' (Katha Sudha) పేరిట ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఈటీవీ విన్' (ETV Win) కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా రూపొందిందే 'నేను'. జయసుధ తనయుడు, నటుడు నిహార్ కపూర్ దర్శకత్వం వహించారు. శరణ్యా ప్రదీప్ ప్రధాన పాత్రధారి. ఈ కథ మే 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది.

## 'పెద్ది' సెట్స్ లో చిరంజీవి..



తన తనయుడు రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సెట్స్‌కు చిరంజీవి ఇటీవల వెళ్లారు. మూవీ టీమ్‌తో కలిసి సందడి చేశారు. సంబంధిత వీడియో శుక్రవారం విడుదలైంది. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ సినిమా జూన్ 4న (విడుదల కానున్న సంగతి తెలిసిందే.

## నిజ జీవితాలకు ఉపయోగపడే క్లైమాక్స్



''మంచి కాన్సెప్ట్ ఉన్న వినోదాత్మక కుటుంబ కథా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'' అన్నారు హీరో త్రిగుణ్. ఆయన.. పాయల్ రాధాకృష్ణ జంటగా నటించిన ఈ సినిమాని మధుదీప్ చెలికాని తెరకెక్కించారు. అరవింద్ మండెం నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 15న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మధుదీప్ మాట్లాడుతూ.. ''ఈ సినిమా మనం రోజువారీగా చూసే పాత్రలు, సంఘటనలతో చాలా సరదాగా ఉంటుంది. దీంట్లో ఓ చక్కటి ప్రేమకథ కూడా ఉంది. అందులోని సంఘర్షణ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఈ వేసవికి కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. క్లైమాక్స్ నిజ జీవితాలకు ఉపయోగపడేలా ఉంటుంది'' అన్నారు. ''అందరికీ నచ్చే చిత్రమిది. తప్పకుండా ప్రతిఒక్కర్నీ నవ్విస్తుంది. దీన్ని థియేటర్స్‌లో చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు హీరో త్రిగుణ్. ఈ కార్యక్రమంలో పాయల్ రాధాకృష్ణ, ముత్యాల రామ్‌దాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటీటీలోకి 'ధురంధర్ 2'.. కాకపోతే చిన్న ట్విస్ట్..

ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' (Dhurandhar 2) ఓటీటీ డేట్ లాక్ చేసుకుంది. నేటికి ఈ సినిమా విడుదలై 50 రోజులైన సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ యాప్‌లో దీని ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని వెల్లడించింది. మే 14 నుంచి ఓవర్సీస్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది (Dhurandhar 2 OTT). అన్‌కట్ వెర్షన్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. 3.52 గంటల నిడివితో 'ధురంధర్: ది రివెంజ్'ను డిజిటల్ ప్రేక్షకులకు అందిస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ (Netflix) పేర్కొంది. ఇక ఇండియాలో జియోహాట్ స్టార్ వేదికగా ఇది అందుబాటులోకి రానుంది. మే 15 నుంచి ఇక్కడి ప్రేక్షకులకు ఇది అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. జియో హాట్‌స్టార్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

--**కథేంటంటే..** ఆపరేషన్ 'ధురంధర్'లో భాగంగా జస్కిరాత్ సింగ్ తన పేరును హమ్జా అలీ మజారీ (రణ్‌వీర్ సింగ్)గా మార్చుకుని పాకిస్థాన్ వెళ్తాడు. అక్కడి ల్యారీ పట్టణంలోని బలోచ్ తెగ నాయకుడు రెహమాన్ డెకాయిత్ (అక్షయ్ ఖన్నా)ను చంపేస్తాడు. ఇదే అదనుగా భావించిన మరో గ్యాంగ్ నాయకుడు అర్షద్ పప్పు (అశ్విన్ ధర్) ల్యారీకి తనని తాను కింగ్‌గా ప్రకటించుకుంటాడు (Dhurandhar 2 OTT). అన్న చావుకు అర్షద్ పప్పు కారణమని తెలిసిన ఉజెయిర్ బలోచ్ (డానిష్) అతడిపై ఎలా పగ తీర్చుకున్నాడు? ఉజెయిర్ బలోచ్ ల్యారీ పీఠం ఎక్కకుండా హమ్జా వేసిన ఎత్తులు ఏంటి? ఈ క్రమంలో ఎస్పీ అస్లాం చౌదరి (సంజయ్ దత్) నుంచి హమ్జాకు ఎలాంటి ప్రతిఘటన ఎదురైంది? బడే సాబ్ అలియాస్ దావూద్ ఇబ్రహీం (డానిష్ ఇక్బాల్) ఆదేశాల మేరకు ఉగ్రదాడులకు ప్రణాళిక రచించిన మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్)ను హమ్జా ఎలా అడ్డుకున్నాడు? హమ్జా ఇండియన్ గూఢచారి అని తెలిసిన తర్వాత ఇక్బాల్ ఏం చేశాడు?అనేది కథ.



## రేజర్.. రివ్యూ.. రవిబాబు యాక్షన్ థ్రిల్లర్ ఎలా ఉంది?

చిత్రం: రేజర్; నటీనటులు: రవిబాబు, తనీష్, బెనర్జీ, మిర్చి హేమంత్ వీరయ్య చౌదరి తదితరులు; రచన, దర్శకత్వం, నిర్మాణం: రవిబాబు; విడుదల: 08-05-2026

కొత్త రకమైన కథలకు కేరాఫ్ రవిబాబు. ఆయన్నుంచి ఎప్పుడు ఎలాంటి సినిమా వస్తుందో ఎవ్వరూ ఊహించలేరు. తన సినిమా పేరు మొదలుకొని ప్రతి అంశంలోనూ వైవిధ్యం ప్రదర్శిస్తుంటారు. ఈసారి 'రేజర్' (Razor movie 2026) పేరుతో పక్కా యాక్షన్ సినిమా చేశారు. మరి ఈ మూవీ ఎలా ఉంది?

**కథేంటంటే..** విష్ణు (తనీష్) సీసీ కెమెరాలకు సంబంధించిన ఓ కంపెనీని నిర్వహిస్తుంటాడు. భార్య లక్ష్మి, కూతురు తేజునే అతడి ప్రపంచం. ఆయన అమర్చిన ఓ సీసీ కెమెరాలో ముఖ్యమంత్రి హత్యకు సంబంధించిన విజువల్స్ రికార్డ్ అవుతాయి. ముఖ్యమంత్రి పీఠం ఎక్కాలనుకున్న రాష్ట్ర హోం మంత్రి ఆ దారుణానికి పాల్పడతాడు. అన్ని జాగ్రత్తలు తీసుకుని హత్య చేసినా, విష్ణు అమర్చిన సీసీ కెమెరాలో హత్యోదంతం రికార్డు కావడంతో హోం మంత్రి కంగారు పడతాడు. వెంటనే విష్ణుని హత్య చేయిస్తాడు. అయితే సీసీ కెమెరాలో రికార్డ్ అయిన విజువల్స్ మాత్రం హోం మంత్రి గ్యాంగ్‌కి దొరక్కుండా దాచేస్తాడు విష్ణు. తండ్రి హత్యని ప్రత్యక్షంగా చూసిన చిన్నారి తేజు ప్రాణాపాయ స్థితిలో పడుతుంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ పాపను రక్షించే బాధ్యత రేజర్ (రవిబాబు) తీసుకుంటాడు. కుక్కల సంరక్షకుడిగా పనిచేసే రేజర్ నేపథ్యం ఏమిటి?అతను హోం మంత్రి, ఆయన ముఠా నుంచి పాపని ఎలా రక్షించాడు?ఈ కథలో రుద్ర ఎవరు?అన్నది చిత్ర కథ.

**ఎలా ఉందంటే..**

చాలా పెద్ద కథలా ఉందే అనిపించొచ్చు కానీ, సినిమా ఆరంభమయ్యాక తొలి పదిహేను నిమిషాలలోపే ఇదంతా జరిగిపోతుంది. మిగిలిన సినిమా అంతా కూడా హోం మంత్రి ముఠా... చిన్నారి తేజుని, హీరోని వెంటాడడం, వాళ్ల నుంచి తమని తాము కాపాడుకుంటూ మూడు పార్శ్వాలుగా ఉన్న వీడియోని కనిపెట్టి బయట పెట్టడం చుట్టూనే తిరుగుతుంది. సర్వైవల్ డ్రామాల్ని గుర్తు చేసే ఈ సినిమా యాక్షన్ సన్నివేశాలతో పరుగులు పెడుతూనే ఉంటుంది. ఆ పరుగే ఈ సినిమాని ఆసక్తికరంగా మార్చింది. మూడు లేయర్లుగా ఉన్న హత్య విజువల్స్‌ని కనిపెట్టడం కూడా ఓ పజిల్‌లా ఉంటుంది.తెరపైన రక్తపాతం మాత్రం ఓ స్థాయిలో సాగుతుంటుంది. సున్నిత మనస్కులు ఈ సినిమాకి దూరంగా ఉండడం చాలా మంచిది. ఫోర్క్‌తో కనుగుడ్లు పీకి పారేయడం, తలలు, కాళ్లు అడ్డంగా నరికేయడం... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా మనుషుల్ని హింసించవచ్చో, ఎన్ని రకాలుగా చంపొచ్చో అన్ని రకాల్నీ ఈ సినిమాలో చూపించినట్టైంది. 'మార్కో', 'కిల్' తదితర భారతీయ సినిమాల్ని గుర్తు చేస్తుందీ చిత్రం. అయితే ఆ సినిమాల్లో భావోద్వేగాలు బలమైన ప్రభావం చూపిస్తుంటాయి. ఇందులో ఆ లోపం కనిపిస్తుంది.చిన్నారిని వెంట పెట్టుకుని రౌడీలను పొడుస్తూ పరిగెడుతూనే ఉంటాడు హీరో. తల్లిదండ్రులకు దూరమైన చిన్నారి వెనక ఆర్ద్రత కానీ, కళ్ల ముందే తన ప్రపంచాన్ని కోల్పోయిన హీరో వేదన వెనక సంఘర్షణ బలంగా చూపించలేదు. ద్వితీయార్ధంలో రుద్ర ఎపిసోడ్ ఈ సినిమాకి కీలకం. హీరో చేసే వీరోచితమైన యాక్షన్ విన్యాసాలకు జస్టిఫికేషన్‌లా ఉంటుంది ఆ ఎపిసోడ్. రవిబాబు సినిమాలు ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన థీమ్, కలర్ పాలెట్ తో కనిపిస్తుంటాయి. గ్రే కలర్ ప్యాలెట్ తో సాగే సన్నివేశాలతో సినిమాకి కొత్త లుక్ వచ్చింది.

**ఎవరెలా చేశారంటే..**

రవిబాబు, బెనర్జీ, తనీష్... ఇలా ముగ్గురు నలుగురు తప్ప అంతా కొత్త నటులే. సినిమా అంతా రవిబాబు, చిన్నారి చుట్టూనే సాగుతుంది. రవిబాబు చేసిన యాక్షన్ విన్యాసాలు ఆకట్టుకుంటాయి. ఆయన కటౌట్ కారణంగా యాక్షన్ సన్నివేశాల్లో వాస్తవికత కనిపిస్తుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. యాక్షన్, ఛాయాగ్రహణం, సంగీతం... ఈ మూడు విభాగాలూ మంచి పనితీరుని కనబరిచాయి. యాక్షన్‌ని డిమాండ్ చేసేలా కథ, సన్నివేశాలతో దర్శకుడు స్క్రిప్ట్‌ని సిద్ధం చేసుకున్నారు. భావోద్వేగ కోణంపై కూడా దృష్టి పెట్టి ఉంటే ఇంకాస్త బాగుండేది. నిర్మాణం ఉన్నతంగా ఉంది. నాణ్యమైన విజువల్స్‌తో సినిమా కట్టిపడేస్తుంది.




**బలాలు....** యాక్షన్ సన్నివేశాలు, రవిబాబు నటన, విజువల్స్, నేపథ్య సంగీతం,

**బలహీనతలు...** మితిమీరిన రక్తపాతం, కొత్తదనం లేని కథ

**చివరిగా:** రేజర్... రవిబాబు యాక్షన్ విన్యాసాలతో!

**గమనిక:** ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

## గోల్డెన్ గ్లోబ్స్ అవార్డ్స్.. ఏఐపై కొత్త నిబంధనలు

సినీ ఇండస్ట్రీలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల నిర్వాహకులు ఏఐ కొత్త నిబంధనలు విడుదల చేశారు. ఇటీవలే ఆస్కార్ కూడా దీనిపై రూల్స్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు గోల్డెన్ గ్లోబ్స్ (Golden Globes) నిర్వాహకులు 2027లో జరగనున్న వేడుకల కోసం తాజాగా మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ్యంగా సినిమాల్లో కృత్రిమ మేధ (AI) వినియోగంపై ఈ సంస్థ స్పష్టమైన నిబంధనలను రూపొందించింది. హాలీవుడ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గోల్డెన్ గ్లోబ్స్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 2027 అవార్డుల కోసం వచ్చే ఎంట్రీలలో ఏఐ ఉపయోగించినవి ఉండొచ్చు.. కానీ, మానవ సృజనాత్మకతే ప్రధానంగా ఉండాలని స్పష్టం చేసింది. ఏదైనా సన్నివేశంలో ఏఐని వాడినప్పుడు దాని గురించి తప్పనిసరిగా వెల్లడించాలి. ముఖ్యంగా నటీనటుల వాయిస్, రూపాన్ని ఏఐతో మార్చినట్లయితే ఆ వివరాలు తప్పనిసరిగా మెన్షన్ చేయాలని పేర్కొంది. యాక్టింగ్‌లో ఎంట్రీ పొందాలంటే.. ఏఐ ఉపయోగించిన సన్నివేశాల కంటే మామూలు వాటికే అధిక ప్రాధాన్యం ఉంటుంది. నటీనటుల యాక్టింగ్‌కు ఏఐ అదనపు మెరుగులు దిద్దినప్పటికీ వారి నటననే ప్రధానంగా చూడనున్నట్లు తెలిపింది. అలాగే, అనుమతులు లేకుండా ఎవరిదైనా వాయిస్, రూపాన్ని ఉపయోగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సంస్థ స్పష్టం చేసింది. దర్శకత్వం, రచన, సంగీతం, యానిమేషన్ విభాగాల్లో కూడా ఇదే నిబంధన వర్తిస్తుందని పేర్కొంది. ఏఐ కేవలం సహాయం కోసం ఉండాలే కానీ, దానికి అధిక ప్రాధాన్యం ఉండకూడదని తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 10న ఈ వేడుక జరగనుంది.



# కోల్‌కతాకు వరుసగా నాలుగో విజయం



న్యూఢిల్లీ: తొలి ఆరు మ్యాచ్‌ల్లో గెలుపనేదే లేకుండా సాగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆలస్యంగానైనా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థి బ్యాటర్లు పరుగుల కోసం కష్టపడిన చోట ఓపెనర్ ఫిన్ ఆలెన్ (47 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో హోరెత్తించాడు. ఫలితంగా శుక్రవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. కోల్‌కతాకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. దీంతో పట్టికలో 9 పాయింట్లతో ఏడో స్థానానికి చేరింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50), అశుతోష్ శర్మ (28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39), కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 4 ఫోర్లతో 23) మాత్రమే రాణించారు. కార్తీక్ త్యాగి, అనుకుల్ రాయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో కోల్‌కతా 14.2 ఓవర్లలో 2 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. కామెరూన్ గ్రీన్ (27 బంతుల్లో 2 సిక్సర్లతో 33 నాటౌట్) ఆకట్టుకున్నాడు. సెంచరీ హీరో ఫిన్ ఆలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

**శతక భాగస్వామ్యం:** స్వల్ప ఛేదనను కోల్‌కతా సునాయాసంగా ముగించింది. ఓపెనర్ ఫిన్ ఆలెన్ ఢిల్లీ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఢిల్లీ బ్యాటర్లు కష్టపడిన చోట అతను ఏకంగా 10 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడికి గ్రీన్ సహకరించడంతో కోల్‌కతా 34 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. ఆరంభంలో మరో ఓపెనర్ రహానె (13) కూడా వేగంగా ఆడినా, అతను మూడో ఓవర్‌లోనే రనౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లో రఘువంశీ (1)ని అక్షర్ పటేల్ బౌల్డ్ చేశాడు. స్వీప్ షాట్ ఆడే క్రమంలో బంతి అతడి గ్లౌవ్స్‌ను తాకి పైకి లేచి కింద పడే క్రమంలో బెయిల్స్‌ను తాకింది. ఇక, పవర్‌ప్లే తర్వాత ఆలెన్ విధ్వంసం సాగింది. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు రాబట్టాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తయ్యాక అతడు మరింత చెలరేగాడు. విప్రజ్ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాది 21 రన్స్ అందించాడు. ఇక విజయానికి రెండు పరుగులు.. శతకానికి ఆరు పరుగులు కావాల్సిన తరుణంలో పేసర్ ముకేశ్ షార్ట్ పిచ్ బంతిని ఆలెన్ సిక్సర్‌గా మలిచాడు. దీంతో ఐపీఎల్‌లో తన తొలి శతకం నమోదు చేయడంతో పాటు జట్టును కూడా గెలిపించి సంబరాలు చేసుకున్నాడు. మూడో వికెట్‌కు ఆలెన్-గ్రీన్ అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు.

చెమటోడ్చిన ఢిల్లీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలో వికెట్లను కూడా చేజార్చుకుంది. ఓపెనర్ నిస్సాంకతో పాటు చివర్లో అశుతోష్ మినహా ఇతర బ్యాటర్లు ఏమాత్రం ప్రభావం చూపలేదు. కోల్‌కతా పేసర్లు, స్పిన్నర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ 150 పరుగులైనా చేయలేకపోయింది. వాస్తవానికి నిస్సాంక మరో ఓపెనర్ రాహుల్ ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించారు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ చకచకా పరుగులు రాబట్టారు. పేసర్ కార్తీక్ ఐదో ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అక్కడి నుంచి ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. నితీశ్ రాణా (8), సమీర్ రిజ్వీ (3), స్టబ్స్ (2)లను ఏమాత్రం కుదురుకోనీయకుండా ప్రత్యర్థి బౌలర్లు పెవిలియన్‌కు చేర్చడంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. దీనికితోడు 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన నిస్సాంక స్టంపౌట్ కావడం మరింత దెబ్బతీసింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్ల ధాటికి కెప్టెన్ అక్షర్ (11), అశుతోష్ ఆచితూచి ఆడాల్సి వచ్చింది. ఓ దశలో వీరి ఆట టెస్టును తలపించింది. అయితే 17వ ఓవర్‌లో అశుతోష్ 6,4,4తో 16 రన్స్ అందించాడు. 19వ ఓవర్‌లో అక్షర్ వెనుదిరగడంతో ఆరో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అశుతోష్ మాత్రం అదే ఓవర్‌లో 6,3తో జోరును చూపాడు. కానీ చివరి ఓవర్‌లో పేసర్ కార్తీక్ మూడు పరుగులే ఇచ్చి అశుతోష్ వికెట్ తీయగా స్టార్క్ (0) రనౌటయ్యాడు.



### స్కోరు వివరాలు

**ఢిల్లీ:** నిస్సాంక (స్టంప్డ్) రఘువంశీ (బి) అనుకుల్ 50, రాహుల్ (సి) గ్రీన్ (బి) కార్తీక్ త్యాగి 23, నితీశ్ రాణా (సి) నరైన్ (బి) గ్రీన్ 8, రిజ్వీ (సి) పావెల్ (బి) నరైన్ 3, స్టబ్స్ (బి) అనుకుల్ 2, అక్షర్ (సి) అనుకుల్ (బి) వైభవ్ అరోరా 11, అశుతోష్ (సి) రహానె (బి) కార్తీక్ త్యాగి 39, విప్రజ్ నిగమ్ (నాటౌట్) 3, స్టార్క్ (రనౌట్) 0, ఎన్‌గిడి (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 142/8; వికెట్ల పతనం: 1-49, 2-74, 3-80, 4-85, 5-89, 6-128, 7-140, 8-140; బౌలింగ్: అనుకుల్ రాయ్ 4-0-31-2, వైభవ్ అరోరా 3-0-29-1, నరైన్ 4-0-17-1, కార్తీక్ త్యాగి 4-0-25-2, వరుణ్ 4-0-28-0, గ్రీన్ 1-0-12-1.

**కోల్‌కతా:** రహానె (రనౌట్) 13, ఫిన్ ఆలెన్ (నాటౌట్) 100, అంగ్రిష్ రఘువంశీ (బి) అక్షర్ 1, గ్రీన్ (నాటౌట్) 33, ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 14.2 ఓవర్లలో 147/2; వికెట్ల పతనం: 1-29, 2-31; బౌలింగ్: స్టార్క్ 3-0-31-0, అక్షర్ 4-0-27-1, ఎన్‌గిడి 2-0-7-0, విప్రజ్ 2-0-34-0, కుల్దీప్ 3-0-41-0, ముకేశ్ 0.2-0-7-0.



## భారత టీ20 కెప్టెన్‌గా శ్రేయస్?

ముంబయి: భారత టీ20 జట్టుకు కెప్టెన్ మారే సంకేతాలు కనిపిస్తున్నాయి. రెండేళ్లుగా జట్టును నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడబోతున్నట్లే. ఈ ఏడాది మార్చిలో సూర్య నేతృత్వంలో టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమ్ఇండియా.. ఆ తర్వాత మ్యాచ్‌లు ఆడలేదు. వచ్చే నెలలో ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌తో కొత్త సీజన్‌ను ఆరంభించబోతోంది. ఆ సిరీస్ నుంచి కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు చేపట్టే అవకాశముంది. ఈ మేరకు భారత సెలక్టర్లు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సూర్య నాయకత్వంలో టీమ్ఇండియా ఒక్క టీ20 సిరీస్ కూడా ఓడిపోలేదు. పైగా టీ20 ప్రపంచకప్ కూడా గెలిచింది. కానీ ఈ కాలంలో సూర్య వ్యక్తిగత ప్రదర్శన మాత్రం పడిపోయింది. 2024లో పూర్తి స్థాయి కెప్టెన్‌గా నియమితుడయ్యాక 45 మ్యాచ్‌ల్లో 25.88 సగటుతో 932 పరుగులే చేశాడు. అందులో ఆరు అర్ధశతకాలే ఉన్నాయి.

సూర్య వ్యక్తిగత ప్రదర్శన ఎలా ఉన్నప్పటికీ.. అతడి సారథ్యంలో జట్టు వరుసగా సిరీస్‌లు గెలుస్తుండడం, పైగా టీ20 ప్రపంచకప్ ఆడాల్సి ఉండడంతో బాధ్యతల నుంచి తప్పించలేదు. కానీ ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టును గెలిపించాక సూర్య.. ఐపీఎల్‌లో తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. అతడి ఆట మెరుగుపడే సంకేతాలు కనిపించడం లేదు. మరోవైపు శ్రేయస్ కెప్టెన్‌గా అదరగొడుతున్నాడు. 2024లో కోల్‌కతాకు కప్పు అందించిన అతను.. నిరుడు పంజాబ్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. ఈ సీజన్లోనూ పంజాబ్ అతడి సారథ్యంలో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. ఐపీఎల్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా నిలకడగా రాణిస్తున్న అతడిని భారత టీ20 జట్టుకు ఎంపిక చేయాలని, కెప్టెన్‌గానూ నియమించాలని డిమాండ్లు వినిపిస్తుండగా.. సెలక్టర్లు అదే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనున్న భారత్.. ఆ తర్వాత అయిదు టీ20ల సిరీస్ కోసం ఇంగ్లాండ్‌కు వెళ్తుంది. ఐపీఎల్ ముగిశాక ఈ సిరీస్‌ల కోసం జట్టును ఎంపిక చేస్తారు.

## భారత స్పిన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులే



ముంబయి: భారత స్పిన్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ లెగ్ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులేను కోచ్‌గా నియమించనుంది. అతడి ఎంపిక ఖాయమైందని, రాబోయే రెండేళ్లు భారత జట్టు స్పిన్ కోచ్‌గా వ్యవహరిస్తాడని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. వచ్చే నెలలో అఫ్గానిస్థాన్‌తో స్వదేశీ సిరీస్‌తో బహుతులే పదవీకాలం ప్రారంభంకావొచ్చు. ప్రస్తుత ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు స్పిన్ కోచ్‌గా ఉన్న బహుతులే.. సీజన్ ముగిశాక ఆ ఫ్రాంచైజీకి వీడ్కోలు పలికి టీమ్ఇండియాతో చేరనున్నాడు. భారత స్పిన్నర్లకు దిశానిర్దేశం చేసేందుకు అనుభవజ్ఞుడైన కోచ్ అవసరమన్న చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ విజ్ఞప్తి మేరకు బహుతులే నియామకం జరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత కోచ్‌ల బృందంలో సితాంశు కొటక్ (బ్యాటింగ్), మోర్నీ మోర్కెల్ (పేస్ బౌలింగ్), దిలీప్ (ఫీల్డింగ్), ర్యాన్ టెన్ డస్కాటే (సహాయ) శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు

## మమ్మల్ని గుర్తించండి



దిల్లీ: థామస్ కప్‌లో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల జట్టుకు స్వదేశంలో పెద్దగా స్పందన లభించకపోవడం పట్ల డబుల్స్ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ భావోద్వేగంతో స్పందించాడు. తాము డబ్బు, భారీ ఊరేగింపులు కోరుకోవట్లేదని.. తమ విజయాలను గుర్తిస్తే చాలని సాత్విక్ తెలిపాడు. ఇటీవల డెన్మార్క్‌లో జరిగిన థామస్ కప్‌లో భారత్ కాంస్య పతకం గెలవడంలో సాత్విక్ చిరాగ్ శెట్టి జోడీ కీలకపాత్ర పోషించింది. పతకంతో తిరిగొచ్చిన సాత్విక్ సామాజిక మాధ్యమం వేదికగా తన అసంతృప్తిని వ్యక్తంచేశాడు. ''తిరిగి ఇంటికి చేరుకున్నా. గత రెండు వారాలుగా ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఎవరూ పట్టించుకోనట్లుగా అనిపిస్తోంది'' అని సాత్విక్ పేర్కొన్నాడు. శుక్రవారం సాత్విక్ తన ఆలోచనలను మరింత వివరంగా పంచుకున్నాడు. ''ప్రతి విజయాన్ని.. అది చిన్నదైనా, పెద్దదైనా ప్రోత్సహించి వేడుకగా జరుపుకునే సంస్కృతిని పెంపొందించుకోవాలి. థామస్ కప్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో రాణించడం వెనుక క్రీడాకారుల ఎన్నో ఏళ్ల త్యాగం, కష్టం ఉంటుందని.. అలాంటి విజయాలకు నిశ్శబ్దం ఎదురైనప్పుడు మనస్తాపానికి గురవుతాం. ఇది కేవలం మాకు మాత్రమే కాదు మమ్మల్ని చూసి స్ఫూర్తి పొందే భవిష్యత్తు తరం క్రీడాకారులను కూడా నిరాశకు గురిచేస్తుంది. డబ్బు లేదా భారీ ఊరేగింపుల కంటే తమ కృషిని దేశం గుర్తిస్తుందన్న భావన క్రీడాకారులకు కొండంత అండనిస్తుంది. అన్ని క్రీడలను ఒకే రకమైన అభిరుచితో ఆదరించండి. ఎవరు ఎక్కువ గెలిచారు.. ఎవరు తక్కువ నెగ్గారు అన్నది కాకుండా భారత జెర్సీ ధరించిన ప్రతి ఒక్కరినీ గౌరవించండి'' అని సాత్విక్ పేర్కొన్నాడు.

## భారత్ 21 ఏళ్ల తర్వాత.. ఆసియాకప్ ఫుట్‌బాల్ క్వార్టర్స్ లో



సుజు (చైనా): భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. ఏఎఫ్‌సీ అండర్-17 మహిళల ఆసియాకప్‌లో 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం గ్రూప్-బి ఆఖరి పోరులో భారత్ 4-0తో లెబనాన్‌ను చిత్తు చేసింది. 6వ నిమిషంలో ప్రీతిక బర్మన్ గోల్ కొట్టి జట్టును ముందంజలో నిలిపింది. తర్వాత అల్వ దేవి (36వ), జోయా (72వ) సఫలం కావడంతో భారత్ తిరుగులేని ఆధిక్యం సాధించింది. ఆఖర్లో ప్రీతిక (85వ) మరో గోల్ కొట్టి ఘన విజయాన్ని ఖాయం చేసింది. దీంతో గ్రూప్-బిలో 3 మ్యాచ్‌ల్లో 3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన భారత్ ముందంజ వేసింది. చివరగా 2005లో జట్టు క్వార్టర్స్ చేరింది. గ్రూప్ 'బి' నుంచి జపాన్ (9), ఆస్ట్రేలియా (4) కూడా నాకౌట్ చేరాయి. ఆసియాకప్‌లో సెమీస్ చేరితే భారత్.. 2026 అండర్-17 ప్రపంచకప్ బెర్తు దక్కించుకుంటుంది.

## ఆటగాళ్ల గదుల్లోకి నో ఎంట్రీ

దిల్లీ: ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ఆటగాళ్ల క్రమశిక్షణ, భద్రత విషయంలో బీసీసీఐ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు అధికారుల హోటల్ గదుల్లోకి అనధికార వ్యక్తులను నిషేధించింది. భద్రతపరమైన ముప్పు, చట్టపరమైన ఇబ్బందులు తలెత్తవచ్చని బీసీసీఐ హెచ్చరించింది. ఈ సీజన్‌లో కొన్ని అవాంఛనీయ ఘటనలు, ప్రోటోకాల్ ఉల్లంఘనలు బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) దృష్టికి రావడంతో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇకమీదట ఏ అతిథి అయినా ఆటగాళ్ల గదుల్లోకి వెళ్లాలంటే జట్టు మేనేజర్ నుంచి కచ్చితమైన లిఖితపూర్వక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈమేరకు 10 ఫ్రాంచైజీల సీఈఓలకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా లేఖలు రాశాడు. ఐపీఎల్ గౌరవానికి, ఫ్రాంచైజీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ఉల్లంఘనలను సహించేది లేదని సైకియా స్పష్టం చేశాడు. ''ఈ సీజన్‌లో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది, జట్టు అధికారుల ప్రమేయంతో కొన్ని దుష్ప్రవర్తన, ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగినట్లు బీసీసీఐ దృష్టికి వచ్చింది. ఈ సంఘటనలను పరిష్కరించకుండా వదిలేస్తే టోర్నీ, సంబంధిత ఫ్రాంచైజీతో పాటు బీసీసీఐ ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉంది'' అని సైకియా తెలిపాడు. క్రీడారంగంలో ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని జరిగే హనీట్రాప్ ముప్పు పట్ల ఫ్రాంచైజీలు అప్రమత్తంగా ఉండాలని బోర్డు సూచించింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బంది తమకు కేటాయించిన సెక్యూరిటీ లైజన్ ఆఫీసర్ (ఎస్ఎల్ఓ) లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్ (టీఐఓ)కి సమాచారం ఇవ్వకుండా వేళకాని వేళల్లో హోటల్ వెలుపలికి వెళ్లడాన్ని కూడా బోర్డు నిషేధించింది. నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో చూసేందుకు బీసీసీఐ లేదా ఐపీఎల్ ఆపరేషన్స్ టీమ్ ఎప్పుడైనా తనిఖీలు నిర్వహించొచ్చు. ఈ కొత్త నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించే ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి భారీ జరిమానాతో పాటు సస్పెన్షన్ లేదా టోర్నీ నుంచి బహిష్కరించే అవకాశం కూడా ఉందని స్పష్టంచేసింది. ప్రతి ఒక్కరూ వృత్తిపరమైన ప్రమాణాలు, క్రమశిక్షణ పాటించాలని కోరింది.